సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 30-8-2024 15/-




# యు టర్న్






కట్నమన్నదే కంఠపాశమై....

సహజీవన భావనల సావురాయి
గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 35 హైదరాబాద్
శుక్రవారం 30 ఆగస్టు 2024 రూ.15-00
25 సఫర్ 1446 హిజ్రీ

**తొలిగీటు**

మీరు మీ పెద్దల సేవ చేయండి. మీ సంతానం కూడా మీకు సేవలు చేస్తుంది.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




**మరీ ఇంత దారుణమా?**

## లోపల...

| | | |
|---|---|---|
| ఇదా నవభారతం | ...... | 04 |
| యు టర్న్ | ...... | 05 |
| దేవుని బెబ్బులి!! – 44 | ...... | 09 |
| చరితార్థులు–2 : మలిక్ వాయజుల్ హఖ్ | ...... | 11 |
| కృతజ్ఞతగా మెలగండి | ...... | 12 |
| దైవ దూషణ భావ స్వేచ్ఛ ఇస్లామ్ | ...... | 14 |
| ఖుర్ఆన్ మార్గం | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| దైవమార్గ బోధన – సంపూర్ణ నివారిణి–2 | ...... | 20 |
| ముస్లిం మహిళా సైనికులు | ...... | 23 |
| కట్నమన్నదే కంఠపాశమై.... | ...... | 26 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| పాపాల ఊబిలో పడిపోరాదు | ...... | 33 |

**నువ్వాగొద్దు,**
**ఇక కానీ..!**




రైతురుణం ఉత్తిదంట
ఇది కేటీయారు మాట
కాంగిరేసు సర్కారుపై
పేలుస్తడంట తూటా!

కేదరుతో కలిసి వచ్చి
కూర్చుంటడంట బైట
రైతు రణం బేనరుతో
పడ్తడంట పోరుబాట!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఇదా నవభారతం

నగరాల్లో, పట్టణాల్లో అందరూ కలిసిమెలిసి ఉంటారు. కులం మతం ఇంకెక్కడున్నాయని కొందరు వాదించడం చాలా సార్లు వింటూ ఉంటాం. కులవివక్ష, మతవివక్ష నిజంగా లేవా? ఇటీవలి కొన్ని వార్తలు చూస్తే వాస్తవాలు అర్థమవుతాయి.

హిందువుల ప్రాంతంలో ముస్లిములకు అద్దెకు ఇళ్ళు దొరకవు. ఒకవేళ స్వంత ఇల్లు కొనుక్కుంటే దానిపై కూడా నిరసనలు, ఆందోళనలు జరుగుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో పంజాబ్ పురాలో హిందువులు ఎక్కువగా ఉన్నారు. ఒక ముస్లిం మహిళ అక్కడ ఇల్లు కొనుక్కుంది. అధికారులు వెంటనే ఆ ఇంటి రిజిస్ట్రేషన్ రద్దు చేయకపోతే తామంతా వలసపోతామంటూ అక్కడి హిందూ జనాభా డిమాండ్ చేసిందని వార్త. అంతేకాదు ఆందోళనకు కూడా దిగారు. ఈ ప్రాంతంలో ఉన్నవాళ్ళలో చాలా మంది లాయర్లంట. బరేలీ బార్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ అరవింద్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ముస్లింలు వస్తే లవ్ జిహాద్ ప్రమాదం వస్తుందన్నాడు. అస్సలు లవ్ జిహాద్ కేసులెన్ని ఉన్నాయో ఈ లాయరుగారు చెప్పగలడా? ప్రభుత్వం వద్దనే లెక్కలు లేవు. మరికొందరు అక్కడి హిందువులేమన్నారంటే హిందువులు సాత్విక శాకాహారం తింటారంట (నిజమా? హిందువులందరు శాకాహారులా?) ముస్లిములు మాంసాహారం తింటారంట.

కొంతకాలం క్రితం గుజరాత్ నుంచి కూడా ఇలాంటి వార్తే వచ్చింది. ముఖ్యమంత్రి ఆవాస్ యోజన క్రింద ఒక ముస్లిం మహిళకు ఇల్లు ఇచ్చారు. కాని ఆమె అక్కడికి రాకూడదని, ఆమెకు ఇచ్చిన ఇంటి కేటాయింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలకు దిగారు. ముస్లిము ఎవరైనా అక్కడికి వచ్చి నివసిస్తే తమకు ప్రమాదమని గగ్గోలు చేశారు.

ఈ వార్తలు ఏం చెబుతున్నాయి?

మరో వార్త

రషీద్ ఖాన్ అనే వ్యక్తి రాజస్థాన్ జైపూరులో ఆటో నడుపుకుంటాడు. అలా కూడబెట్టిన డబ్బుతో ఒక ఇల్లు కొనుక్కున్నాడు. ఆ ఇంటిని అద్దెకు ఇచ్చాడు. ఆ ఇంటిని మొన్న జిల్లా అధికారులు కూలగొట్టారు. బుల్డోజరు వచ్చి ఆ ఇంటిని కూల్చేసింది. ఆ ఇంటిలో అద్దెకు ఉంటున్న వ్యక్తి కుమారుడు పదోతరగతి చదువుకుంటున్నాడు. ఆ విద్యార్థికి మరో విద్యార్థికి గొడవ జరిగింది. కత్తిపోటు వరకు వెళ్ళింది. ఆ తర్వాత ఈ గొడవ మతఘర్షణగా మారింది. అధికారులు ఆ ఇంటిని కూల్చేశారు. ఆ ఇల్లు గొడవపడిన విద్యార్థి తండ్రిది కాదు. కేవలం అద్దెకు ఉంటున్నాడు. బుల్డోజర్ న్యాయం సరిగానే జరిగిందని పలువురు బీజేపీ నేతలతో పాటు స్థానికులు కూడా వ్యాఖ్యానించారని వార్త. నేరం చేసింది ఎవరు? శిక్ష పడింది ఎవరికి? శిక్ష విధించింది ఎవరు?

ఆ ఇల్లు నిబంధనలకు వ్యతిరేకంగా ఉందనే సాకులు వినిపించవచ్చు. కాని ఇల్లు కూల్చడానికి కారణం ఏమిటో చాలా మంది స్పష్టంగా చెబుతూనే ఉన్నారు. కాబట్టి ఈ సాకులు కేవలం కాగితాలపై రాసే మాటలు మాత్రమే అని అందరికీ తెలుసు.

భారతదేశంలో బుల్డోజర్ (అ)న్యాయాల గురించి ఈ సంవత్సరం ఫిబ్రవరిలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా మాట్లాడింది. అధికారులు ముస్లిముల ఆస్తులను ధ్వంసం చేయడం వెంటనే ఆపాలని కోరింది. అనేకమంది న్యాయనిపుణులు కూడా దీన్ని విమర్శించారు.

ఈ వార్తలన్నీ ఏం చెబుతున్నాయి?

పట్టణాల్లో, నగరాల్లో ఎవరి కులమేమిటో? ఎవరి మతమేమిటో? ఎవరు పట్టించుకుంటారనే వాదనల్లో ఎంత వాస్తవముంది?

ఇదా మనం కోరుకునే నవభారతం?

అబ్దుల్ వాహెద్




# యు టర్న్

**లేటెరల్ ఎంట్రీ అని ఇంగ్లీషులో చెప్పుకున్నా,** అచ్చ తెలుగులో దొడ్డిదోవ అంటే తప్పులేదు. ఈ లేటెరల్ ఎంట్రీ పద్ధతి ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లోని ఖాళీల భర్తీ విధానంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ తర్వాత కేంద్రప్రభుత్వం వెనక్కు తగ్గక తప్పలేదు. లేటెరల్ ఎంట్రీ కోసం చేసిన ప్రకటనను రద్దు చేయాలని యూపిఎస్సీ హెడ్ కు కేంద్రమంత్రి జితేంద్రసింగ్ లేఖ రాశారు. ప్రధాని మోదీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మోదీ తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని వీరోచితంగా సమర్థించే మేధావులకు కొరత లేదు. లేటెరల్ ఎంట్రీలనేవి కాంగ్రెసు కాలంలోను ఉన్నాయని మొదట సమర్థించుకున్నారు. కాని కాంగ్రెసు కాలంలో లేటెరల్ ఎంట్రీగా వచ్చిన మేధావులు, నిపుణులు ఎవరో వచ్చి ఏం చేశారో అందరికీ తెలుసు. మన్మోహన్ సింగ్, మాంటెక్ సింగ్ అహ్లూవాలియా, శ్యామ్ పిట్రోడాలను కాంగ్రెస్ సంబంధిత రంగాల్లో నిపుణులుగా తీసుకువచ్చింది. వారు తమకిచ్చిన బాధ్యతలను నిర్వర్తించి వెళ్ళారు. కాని బీజేపీ లేటెరల్ ఎంట్రీల్లో ఎవరిని తీసుకువస్తోంది. వారి పేర్లేమిటి? వారు సాధించిందేమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. నిపుణుల కోసం కాకుండా కేవలం సాధారణ పరిపాలనాధికారులుగా లేటెరల్ ఎంట్రీ ఎందుకోసం? ఈ ప్రశ్నలకు మోదీని సమర్థించే మేధావుల వద్ద జవాబు లేదు. అలాగే మోదీ లేటెరల్ ఎంట్రీ విషయంలో యు టర్న్ తీసుకోగానే మోదీ అందరి మాట విని, సలహాలు స్వీకరించే నాయకుడని, ఆయన మొండిగా తన మాటే చెల్లించుకోవాలని చూసే నాయకుడు కాదని ప్రశంసలు మొదలు పెట్టారీ మేధావులు. అదే నిజమైతే కొత్త నేరచట్టాలప్పుడు చర్చలు లేకుండా ఎందుకు చేశారన్న ప్రశ్నకు వీరి వద్ద జవాబు ఉండదు.

ఏది ఏమైనా ఇప్పుడు మోదీ ప్రభుత్వం తీసుకున్న సరికొత్త యు టర్న్ లేటెరల్ ఎంట్రీ ప్రకటనను వాపసు తీసుకోవడం. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతి నుంచి ఇలా యు టర్నులు తీసుకోవడం ఇది నాలుగోసారి. కేంద్ర బడ్జెటులో లాంగ్ టర్మ్ కేపిటల్ గెయిన్స్ టాక్సు విషయంలో యు టర్ను తీసుకున్నారు. వక్ఫ్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపి వెనకడుగు వేశారు. ఇలా సెలెక్ట్ కమిటీకి బిల్లు పంపించడం మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నడూ జరగలేదు. బ్రాడ్ కాస్ట్ బిల్లును ఉపసంహరించుకున్నారు.

ప్రభుత్వం ఈసారి లేటరల్ ఎంట్రీ విషయంలో వెనకడుగు వేయడానికి ముఖ్యమైన కారణం ప్రతిపక్షాల విమర్శలు, మిత్రపక్షాల ఒత్తిళ్ళు. ఆగస్టు 21వ తేదీన దళిత సంఘాలు భారత్ బంద్‌కు పిలుపునివ్వడంతో ప్రభుత్వం ఈ వ్యవహారంలో వెనక్కి తగ్గక తప్పదని నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేస్తుందనే మాట ప్రజల్లో ఎంతగా వెళ్ళిందంటే బీజేపీకి ఎదురు దెబ్బలు తప్పలేదు. ఇప్పుడు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకమనే మాట ప్రజల్లోకి వెళితే ఈసారి ఎన్నికల్లో శృంగభంగమవుతుందనే భయమే ఈ వెనకడుగు వెనక ఉంది.

హర్యానా, జమ్ము కశ్మీరుల్లో సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో ఎన్నికలున్నాయి. మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో నవంబరులో ఎన్నికలు జరగబోతున్నాయి. లేటెరల్ ఎంట్రీ వ్యవహారం ఈ ఎన్నికల్లో బీజేపీకి తీవ్రనష్టం కలిగించవచ్చనే భయంతోనే దీన్ని ఉపసంహరించుకున్నారు. ఏది ఏమైనా మోదీ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న

యు టర్నులు పరిశీలిస్తే నిరంకుశంగా, ఒంటెద్దు పోకడలతో పరిపాలించే కాలమిది కాదన్న వాస్తవం పాలకులకు అర్థమైనట్లు కనిపిస్తోంది.

గత పదేళ్ళుగా బీజేపీ అనేక ఘనవిజయాలు సాధించింది. ఈ విజయాలతో వచ్చిన గర్వాతిశయం ప్రతిపక్షాలను నిర్లక్ష్యంగా చూడడంగా వ్యక్తమయ్యింది. ముఖ్యంగా కాంగ్రెసును బీజేపీ పూచిక పుల్లగా జమకట్టడం అనేకసార్లు కనిపించింది. కాంగ్రెసు కూడా పతనావస్థలో ఉండడం వల్ల బీజేపీకి జవాబీయలేకపోయింది. బీజేపీ కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటే కాంగ్రెసు రహిత భారతదేశం తీసుకొస్తామని చెప్పుకుంది. చట్టపరమైన విషయాల్లో కాని, విధానపరమైన విషయాల్లో కాని బీజేపీ ప్రభుత్వం ఎన్నడూ ప్రతిపక్షాలతో సంప్రదించలేదు.

ఈ ఒంటెద్దు పోకడ ఏ స్థాయికి చేరుకుందంటే, ప్రతిపక్షాలతోనే కాదు స్వంత పార్టీలోని వారితో కూడా సలహా సంప్రదింపులు జరగని స్థితి. కేవలం గుజరాత్‌కు చెందిన నేతలు, అధికారులతో మాత్రమే ప్రధాని మోడీ మాట్లాడతారనే ప్రచారం కూడా వినవచ్చింది.

ప్రధానిగా మోడీ అధికారం చేపట్టిన కొత్తలో అరుణ్ జైట్లీ బలమైన నేతగా ఉండేవారు. కాని కొంతకాలానికే అమిత్ షా ఆయన్ను వెనక్కు నెట్టేశారు. చివరకు పరిపాలన అంతా కేవలం ఇద్దరి చేతుల్లోనే కేంద్రీకృతమైందనే విమర్శలు వెల్లువెత్తాయి. కేబినేట్ మీటింగుల్లో కూడా ఎజెండా ఏమిటో చివరి నిముషం వరకు మంత్రులకు తెలిసేది కాదని కూడా తెలియవచ్చింది. చివరకు నిర్ణయాలన్నీ కేవలం ఇద్దరు మాత్రమే తీసుకుంటారనే మాట బలంగా వినిపించడం ప్రారంభమైంది.

పార్టీలోను ఎవరితో కూడా సలహాసంప్రదింపులు లేని పరిపాలనకు అనేకమంది అనేక ఉదాహరణలిస్తున్నారు. రాజస్థాన్ ముఖ్యమంత్రిగా భజన్ లాల్ శర్మ నియామకాన్ని కొందరు ఉదాహరిస్తున్నారు. అలాగే హర్యానా ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ నియామకం కూడా విమర్శల పాలయ్యింది. కాని ఈ పరిస్థితి ఇప్పుడు మారింది. ఒంటెద్దు పోకడలు చెల్లుబాటయ్యే పరిస్థితి ఇప్పుడు లేదు. ఇష్టమున్నా లేకున్నా ఇప్పుడు ప్రతిపక్షాల విమర్శలకు, మిత్రపక్షాల ఒత్తిళ్ళకు తలొగ్గడమే కాదు, స్వంతపార్టీలో వినిపించే స్వరాలను కూడా వినక తప్పదు. ప్రధాని మోడీకి సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపే అనుభవం కొద్దిపాటి కూడా లేదు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉందని చెప్పుకున్నప్పటికీ ఎన్నడూ ఎన్డీయే మిత్రపక్షాలతో ఏ విషయంలో అయినా సంప్రదింపులు జరిపింది లేదు. కాని ఇప్పుడు పరిస్థితి మారింది. లేటరల్ ఎంట్రీ విషయంలో జనతాదళ్ యునైటెడ్, తెలుగుదేశం పార్టీలతో ముందుగా సంప్రదించవలసింది.

జనతాదళ్ యునైటెడ్, లోక్ జనశక్తి పార్టీల రాజకీయాల్లో రిజర్వేషన్ల పాత్ర కీలకమైనది. అలాంటప్పుడు ఈ పార్టీలు లేటరల్ ఎంట్రీ వ్యవహారాన్ని సమర్థిస్తాయని ఎలా భావిస్తాం? ఏకపక్షంగా లేటరల్ ఎంట్రీ కార్యక్రమాన్ని ప్రకటించడం మొదటి తప్పు. ఈ ఒంటెద్దు పోకడ వల్ల సమస్యలు వస్తాయని బహుశా పార్టీలోనే చాలా మంది హెచ్చరించి ఉంటారు. కాని ప్రధాని ఎవరి మాట వినరు కదా.

ఇప్పటికే సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల సమస్య వేడి వేడిగా ఉంది. క్రీమీలేయర్ విషయంలో సుప్రీంకోర్టు రాష్ట్రాలకు అధికారాలు ఇచ్చింది. నిజం చెప్పాలంటే ఇప్పుడు బీసీలు, దళితుల విషయంలో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లోకి వెళ్ళే సమస్య ఏదీ ప్రతిపక్షాల వద్ద లేదు. క్రిమీలేయర్ విషయంలో కూడా కాంగ్రెసుతో సహా ప్రతిపక్షాలు మౌనంపాటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం లేటరల్ ఎంట్రీ గురించి ప్రకటన తీసుకువచ్చింది. ఈ ప్రకటన ప్రతిపక్షాలకు కేంద్రప్రభుత్వం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని దాడి చేసే పూర్తి అవకాశాన్నిచ్చింది. ప్రతిపక్షాలే కాదు రిజర్వేషన్లపై రాజకీయాలు ఆధారపడి ఉన్న జేడీయు, ఎల్జేపీ పార్టీలు బాహాటంగానే దీన్ని విమర్శించాయి. అంటే మిత్రపక్షాలు కూడా మోడీ వైపు లేవు. మిత్రపక్షాల సలహాల మేరకు వెనకడుగు వేశామని, తమది సలహా సంప్రదింపులను విశ్వసించే ప్రభుత్వమని ప్రచారం చేసుకోవచ్చు కానీ అదే నిజమైతే సలహా సంప్రదింపులు ప్రకటనకు ముందు జరగవచ్చు కదా అనే ప్రశ్న ఉండనే ఉంటుంది.

ఇక లేటరల్ ఎంట్రీ విషయానికి వస్తే 2018 నుంచి 2023 మధ్య కాలంలో మోడీ ప్రభుత్వం 63 మంది మధ్యస్థాయి బ్యూరోక్రాట్లను లేటరల్ ఎంట్రీ ద్వారా నియమించింది. అంటే ప్రభుత్వాధికారులను నియమించే రిక్రూట్ మెంట్ వ్యవస్థను అటకపై పెట్టి ఈ నియామకాలు చేశారు. ప్రభుత్వాధికారులను నియమించే రిక్రూట్‌మెంట్ వ్యవస్థ ప్రకారం నియామకాలు జరిగితే షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వారికి కొన్ని పోస్టులు రిజర్వేషన్ల వల్ల లభించేవి. లేటరల్ ఎంట్రీ నియామకాల వల్ల ఈ రిజర్వేషన్లు దెబ్బతిన్నాయి. దీనివల్ల దళిత, ఆదివాసీ మధ్యతరగతి వర్గంలో బీజేపీ పట్ల నిరసన వ్యక్తమయ్యింది కానీ ప్రతి ఎన్నిక గెలుస్తున్న బీజేపీ ఈ నిరసనలను పట్టించుకోలేదు. కాని ఇప్పుడు మాత్రం మిత్రపక్షాలు కూడా తీవ్రంగా విమర్శించిన తర్వాత 45 మంది బ్యూరోక్రాట్లను లేటరల్ ఎంట్రీ ద్వారా నియమించే ఆలోచనను విరమించుకోక తప్పలేదు.

ఈ ప్రకటనను వెనక్కు తీసుకుంటున్నప్పుడు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ప్రత్యేకంగా లేటరల్ ఎంట్రీలో రిజర్వేషన్లు లేకపోవడంపై సమీక్ష జరిపి సంస్కరణలు చేస్తామని చెప్పిన మాటలు కూడా గమనార్హం. అంటే బీజేపీ ఇప్పుడు తాము రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని గట్టిగా చెప్పాలనుకుంటోంది.

నిజానికి బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకం అనే చాలా మంది నమ్ముతున్నారు. ఆరెస్సెస్, బీజేపీ నేతలు రిజర్వేషన్ల విషయంలో తమ

వ్యతిరేకతను దాచుకోలేదు కూడా. కాని ఇప్పుడు రిజర్వేషన్లను బలంగా తాము తప్ప మరెవ్వరు సమర్థించడం లేదన్నట్లు మాట్లాడే ఈ మార్పు వెనుక మారిన రాజకీయ చిత్రపటం ఉంది.

లోక్‌సభ ఎన్నికల్లో తగిలిన ఎదురుదెబ్బలను బీజేపీ మదింపు చేసు కుంటోంది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు రిజర్వు చేయ బడిన స్థానాలను కూడా బీజేపీ ఓడిపోయింది. తమకు భారీ మెజారిటీ ఇస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలతో దళితులు, ఆదివాసీల్లో భయసందేహాలు మొదలయ్యాయి. బీజేపీ రిజర్వేషన్లను తొలగిస్తుందన్న ఆందోళనలు మొదలయ్యాయి.

లేటరల్ ఎంట్రీ ద్వారా నలభై ఐదు మంది అధికారులను నియమిం చడం అన్నది చాలా చిన్న సంఖ్య. కాని ఈ నియామకాలు జరిగితే బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకమనే మాట మరింత బలం పుంజు కుంటుంది. ఆగష్టు 17న జాయింట్ సెక్రటరీలుగా 10 మందిని, డిప్యూటీ సెక్రటరీలుగా 35 మందిని నియమించడానికి ప్రకటన ఇచ్చారు. వెంటనే ప్రతిపక్షాలు దీన్ని విమర్శిస్తూ రిజర్వేషన్లను దెబ్బ తీయడానికి కుట్రగా చెప్పాయి. మిత్రపక్షాల్లో జనతాదళ్ యునైటెడ్, లోక్ జనశక్తి పార్టీ, హిందూస్తానీ అవామ్ మోర్చాలు కూడా ఈ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించాయి. బీజేపీకి పార్లమెంటులో మెజారిటీ లేదు కాబట్టి మిత్రపక్షాల మద్దతు అవసరం. అయితే మొదట్లో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ లేటరల్ ఎంట్రీని సమర్థించు కోడానికి ప్రయత్నించారు. ఇవన్నీ తాత్కాలిక నియామకాలని, వీటి వల్ల రిజర్వేషన్లపై ఎలాంటి ప్రభావం ఉండదని చెప్పుకొచ్చారు. కాని మర్నాడే మరో మంత్రి జింతేంద్ర సింగ్ ఈ ప్రకటనను ఉపసంహరిస్తూ, సామాజిక న్యాయం కోసం, సాధికారతల కోసం ఈ ప్రకటనను వెనక్కు తీసుకుంటున్నామని చెప్పారు. ఆ వెంటనే అశ్వినీ వైష్ణవ్ కూడా బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పట్ల మోడీ ప్రభుత్వానికి ఎంత నిబద్ధత ఉందో ఈ నిర్ణయం ఉప సంహరించుకోవడం వల్ల తెలుస్తుందన్నారు. ఇప్పుడు బీజేపీ బాబా సాహెబ్ అంబేద్కర్ గురించి, సామాజిక న్యాయం గురించి ఎక్కువగా మాట్లాడుతోంది. అగష్టు 9వ తేదీన సుప్రీంకోర్టు క్రీమీలేయరు గురించి తీర్పు వినిపించిన తర్వాత కూడా బీజేపీ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ సూత్రాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఏది ఏమైనా ఈ లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వ వైఖరి మారడానికి కారణం రాజకీయ ఒత్తిళ్ళే. ముఖ్యంగా రిజర్వేషన్ల విషయంలో బీజేపీ ఇప్పుడు ఆచితూచి మాట్లాడుతోంది.

లోక్ జనశక్తి పార్టీ ఇప్పుడు కొత్తగా ఎన్డీయేలోకి రాలేదు. మొదటి నుంచి ఎన్డీయేలోనే ఉంది. అలాగే జనతాదళ్ యునైటెడ్, హిందు స్తానీ అవామ్ మోర్చా పార్టీలు కూడా చాలా కాలంగా ఎన్డీయే మిత్రపక్షాలుగా ఉన్న పార్టీలే. బీజేపీ 2018 నుంచి 2023 వరకు నాలుగు సార్లు ఇలా లేటరల్ ఎంట్రీ నియామకాలు జరిపింది. అప్పట్లో ఈ పార్టీలేవి ఎలాంటి అభ్యంతరాలు వెలిబుచ్చలేదు. అలాగే బీజేపీ కూడా ఎన్నడూ సామాజిక న్యాయం గురించి మాట్లాడలేదు. కాని ఇప్పుడు లోక్ జనశక్తి పార్టీ నాయకుడు చిరాగ్ పాశ్వాన్ నిర్ద్వంద్వంగా లేటరల్ ఎంట్రీ నియామకాలను విమర్శించాడు. ఈ నియామకాలను నిలిపివేసిన తర్వాత తమ వల్లనే ఈ నియామకాలు ఆగిపోయాయని చెప్పుకున్నారు. లోక్ జనశక్తి పార్టీ, హిందూస్తానీ అవామ్ మోర్చా, జనతాదళ్ యునైటెడ్ వంటి పార్టీల ఓటు బ్యాంకుల ప్రయోజనాలను ఈ పార్టీలు ఇప్పుడు కాపాడుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. మరోవైపు సామాజిక న్యాయం గురించి, రాజ్యాంగం పట్ల నిబద్ధత గురించి తరచూ మాట్లాడుతూ బీజేపీ కూడా జారి పోయిన ఓట్లను తిరిగి కూడగట్టుకునే ప్రయత్నంలో ఉంది.

లోక్ జనశక్తి పార్టీ దళిత ఓట్ల వల్లనే ఐదు స్థానాల్లో గెలిచింది. రిజర్వేషన్లకు అనుకూలంగా వ్యవహరించకపోతే ఈ పార్టీకి ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవు. అలాగే ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీకి మిత్రపక్షాలేవీ లేవు. అక్కడ లోక్‌సభ ఎన్నికల్లో తీవ్ర పరాభవానికి కారణం రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం, రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు లేకుండా చేస్తుందన్న ప్రచారమే అని గమనించాలి. ఈ ప్రచారం ఈ సారి ఎన్నికలపై ప్రభావం వేయకుండా బీజేపీ జాగ్రత్త పడుతోంది.

బీజేపీ 2014 తర్వాత హిందీ రాష్ట్రాల్లో విజయాలు సాధించడానికి కారణం యాదవేతర, జాతవేతర కులాలను తన వైపు తిప్పుకోవడం ద్వారా అక్కడి ప్రాంతీయ పార్టీలను దెబ్బతీయడం. సమాజ వాది పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీలు దెబ్బతినడానికి కారణం బీజేపీ వైపు మొగ్గు చూపిన యాదవేతర, జాతవేతర కులాల ఓట్ల బలమే. గ్రామీణ కుటుంబాలకు లాభార్థీ స్కీముల పేరుతో క్యాష్ ట్రాన్స్ ఫర్ పథకాలు అమలు చేయడం కూడా ఈ మొగ్గుకు ఒక కారణం. రబ్డీ కల్చర్ అని చెప్పే బీజేపీ స్వయంగా అదే సంస్కృతికి పెద్ద పీట వేసింది. కాని ప్రతిపక్షాలు లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ రాజ్యాంగాన్ని మార్చుతుందని, రిజర్వేషన్లు లేకుండా చేస్తుందని ప్రజల్లోకి వెళ్ళడమే కాదు, సమాజ్‌వాది పార్టీ యాదవేతర వెనుకబడిన కులాలకు టిక్కెట్లు ఇచ్చి ఆ సముదాయాలను తమ వైపు తిప్పుకోగలిగారు. దళిత, వెనుకబడిన కులాల ఓట్లు తాము కోల్పోయామన్నది బీజేపీ నేతలకు కూడా తెలుసు. నిరుద్యోగ సమస్య కోరలు సాచి వెక్కిరిస్తున్నప్పుడు లాభార్థి స్కీములు కూడా బీజేపీకి లాభించలేదు.

ఆత్మనిర్భర్, ఉద్యోగాలిచ్చేవారిగా మారాలి, ఉద్యోగాలు కోరేవారిగా ఉండరాదంటూ పెద్ద పెద్ద మాటలెన్ని చెప్పినా వాస్తవానికి 80 కోట్ల మందిని రేషన్ షాపుల ముందు క్యూలో నిలబెట్టిన ప్రభుత్వంగా అప్రతిష్ఠ పాలు కావడం కూడా మరో కారణం. ప్రతిపక్షాలు ఈ పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకోగలిగాయి. ఏది ఏమైనా సంకీర్ణ రాజకీయాల వేడి ప్రభుత్వానికి తగులుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. వరుస యు టర్నుల పరంపర కొనసాగు తుందా? వేచి చూద్దాం. ✤

అధ్యాయం -16

44

# 1. జ్ఞాన ఖని!

# దేవుని బెబ్బులి!!

ఎస్.ఎం. మలిక్

## 4. ఖైబర్ ఘటన

హిజ్రీ 7వ సంవత్సరం, ఖైబర్ దుర్గంలోని యూదులు కుట్రలు కుతంత్రాలకు ఆలవాలంగా మారారు. 15 వందల మంది యోధుల్ని తీసుకుని ప్రవక్త మహనీయులు(స) ఖైబర్‌కు బయల్దేరారు. వారిలో రెండు వందల మంది అశ్వారూఢులు ఉన్నారు. ఖైబర్ మదీనా నగరం నుంచి రెండు వందల కిలో మీటర్ల దూరాన ఉంది. రజీ అనే చోటికి చేరిన తరువాత మహిళల్ని, సామగ్రిని అక్కడే వదలి సిపాయిలు ముందుకు సాగారు.

మహనీయ అలీ ఆ రోజుల్లోనే కళ్ళు వచ్చినందువల్ల సేనలో చేరలేక పోయారు. కాని తరువాత అతికష్టమ్మీద ఒంటరిగానే ఖైబర్ చేరారు. ప్రవక్తశ్రీని కలసుకున్నారు. ఆ పైన అక్కడి దుర్గాలు ఒక్కొక్కటే ముస్లిములు వశపరచుకున్నారు. ఇక కమూస్ ఒకటే మిగిలింది. ఇందులోనే యూదుల మహా యోధుడు మర్హబ్ ఉండేవాడు. సహచర యోధులు అందరూ దాన్ని వశపరచుకునే ప్రయత్నాలు చేసి అలసిపోయారు.

### ఖైబర్ విజేత

ఆ రోజు సాయంత్రం ప్రవక్తశ్రీ(స) ఏదో నిర్ణయం తీసుకున్నట్లు "రేపు ఉదయాన్నే నేను యుద్ధ ధ్వజాన్ని ఎవరికి ఇస్తానో అతని చేతనే ఈ కోటను జయింప జేస్తాడు అల్లాహ్" అని ప్రకటించారు. ఆ రాత్రి అందరూ ఆలోచిస్తూనే ఉండిపోయారు, ఈ ఘనత ఎవరికి ప్రాప్తమవుతుందో అని. తెల్లవారు ప్రతి ఒక్కరూ ఆ ఘనత తనకు దక్కాలని కోరుకున్నారు. జనం ప్రవక్త వద్దకు ప్రోగయ్యారు. అంతలోనే ప్రవక్తశ్రీ కేక వేశారు, "అబూ తాలిబ్ తనయుడు అలీ ఏడీ?" అని. ఆయనకు కళ్ళు వచ్చాయని ఎవరో తెలిపారు.

"అతన్ని నా వద్దకు తీసుకురండి" అన్నారు ప్రవక్తశ్రీ. ఆయన రాగానే ఆయన కళ్ళల్లో ప్రవక్తశ్రీ తన నోటి లాలాజలం అంటించారు. ఆ తరువాత దైవాన్ని ప్రార్థించారు. మహనీయ అలీ (ర) ఎంతగా స్వస్థత పొందారంటే తనకు ఆ బాధ అసలు కలగనే లేదని భావించారు ఆయన. ఇక ఇస్లామీయ ధ్వజం ఆయనకు అప్పగించడం జరిగింది.

అప్పుడు మహనీయ అలీ అడిగారు, "ప్రవక్తా! యూదులు మనవలె ముస్లిములయ్యే వరకు పోరాడాలా?" దానికి ప్రవక్త,

"ఎటువంటి రాగద్వేష భావనల్లేకుండా వెళ్ళు, వారి ఎదుట ఇస్లామ్ సందేశాన్ని అందజెయ్యి. మన మీద ఉన్న అల్లాహ్ హక్కులేవో తెలుపు, దైవం సాక్షిగా అలీ! నీ ద్వారా ఒక్క వ్యక్తి అయినా సన్మార్గాన్ని గ్రహించినట్లయితే అది నీ కొరకు అనేక ఎర్ర ఒంటెల కన్నా ఉత్తమమయింది" అన్నారు.

ప్రవక్త(శ్రీ(స) నుడివిన ఈ శుభవార్త పట్ల ప్రసన్నతతో ఆనందంగా జెండా చేత పట్టుకుని దేవుని సేనకు మున్ముందుగా యుద్ధ మైదానంలోకి ప్రవేశించారు మహనీయ అలీ(ర). కమూస్ కోట రాళ్ళ గోడలకు ఎదురుగా, కోట గోడల పైన కానవచ్చే యూదుల నుద్దేశించి ముక్తసరిగా కాని సమగ్రంగా ఓ ప్రసంగం స్పష్టంగా వినిపించారు. అందులో ఇస్లామ్ ఏమిటో, దాని నమ్మకం ఏదో, దాని సందేశం ఏమిటో ఇంపయిన భాషలో తెలిపారు. అయితే మహనీయ మూసా (అలైహిస్సలామ్)ని బూటకంగా నమ్మేవారు దాన్ని పట్టించుకోలేదు.

బదులుగా తన శక్తికి మించిన అహంకారంతో మత్తపుటేనుగులా తన అనుభవం, శూరత్వం మీద తానే సంబరపడుతూ ఊగుతూ మర్హబ్, ఆపాదమస్తకం కవచధారి అయి గుర్రాన్ని ఎక్కి కోట నుంచి బయటకు వచ్చాడు. వస్తూ వస్తూ,

"ఖైబర్ వాళ్ళకయితే బాగా తెలుసు, నేను మర్హబ్‌నని, అస్త్ర ధారినని, అనుభవశాలినని!

నేలపైన పోరు నిప్పు రగలుకుంటే నేనేమవుతానో నాకే తెలియదనీను" అని పాడుకుంటూ రణరంగంలోకి దిగాడు.

మహనీయ అలీ దానికి జవాబుగా,

"నా తల్లి నా పేరు హైదర్(బెబ్బులి) అని పెట్టినప్పుడే జనానికి బాగా తెలుసు, నా రూపం భయంకర శార్దూలం వంటిదని! నేను జనాన్ని అడ్డకత్తెరలో కొలిచినట్లు కొలుస్తానని!!"

తాళలేక పోయాడు మర్హబ్. ఉద్రేకంతో ఊగిపోయాడు. ఒర నుంచి కరవాలం తీశాడు, అతని గుర్రం నేరుగా అబూ తాలిబ్ తనయుని గుర్రానికి చేరువకు వచ్చేసింది. అంతే, దేవుని బెబ్బులి కరవాలం ఝుళిపించగా అది అతని మెదను ఛేదిస్తూ బయట పడింది! ఇంకేముందీ? యూదుల ఆశలు అడుగంటి పోయాయి. ఆ కోట నగరాన్ని చుట్టుముట్టిన 20వ రోజున ముస్లిముల కైవసమయింది.

## ఓ సంఘటన

హిజ్రీ 8వ సంవత్సరం, షాబాన్ నెలలో మక్కా బహు దైవారాధకులు పొరుగున ఉన్న బనీ బిక్ర్ వారి నాయకునికి కుమ్మక్కయి బనీ ఖుజాఅ తెగ మీద దాడి జరిపి హుదైబియా ఒప్పందాన్ని భంగపరిచారు. ఇలా ప్రమాణ భంగం చేసిన తరువాత స్వయంగా వారే భయపడసాగారు. ఆ సందర్భంలో మక్కావాసులు తమ ఓ నాయకుడు అబూ సుఫ్యాన్‌ని మదీనా పంపించి ఏ విధంగా నయినా ఒప్పందం పునరుద్ధరణకు కృషి చేయాలని కోరారు.

ఆయన తన కూతురు, ప్రవక్త సతీమణి మహనీయ ఉమ్ము హబీబా వద్దకు వచ్చి అక్కణ్ణుంచి మస్జిద్‌లో ప్రవక్త(శ్రీని కలిశారు. ఆయన(స) ఏ సమాధానమూ ఇవ్వ లేదు. ఆ తరువాత మహనీయులు అబూ బక్ర్, ఉమర్‌ని కలిశారు. అక్కడా నిరాశే ఎదురైంది. కడకు మహనీయ అలీ వద్దకు వెళ్లారు. అక్కడ మహనీయ ఫాతిమా, హసన్ కూడా కూర్చొని ఉన్నారు. అబూ సుఫ్యాన్ తన రాకకు కారణం తెలిపారు. అప్పుడు మహనీయ అలీ "నేను ఈ విషయంలో ప్రవక్త మహనీయులకు ఏమీ చెప్పలేను. పైగా ఆయన ఓ నిర్ణయానికి వస్తే దాన్ని మార్చనూ లేను" అన్నారు.

## ఉపాయం!

అప్పుడు ఆయన ప్రవక్త కూతురుతో, "నీవు మరేమీ కాకపోయినా నీ కుమారుణ్ణి తాతగారి వద్దకు పంపగలవు" అన్నారు. ఆమె, "లేదండి, నేను స్వయంగానూ ఈ పని చేయలేను మరెవరి చేత నయినా చేయించలేను" అన్నారు. అబూ సుఫ్యాన్ ఏమీ తోచక బాధపడ సాగారు. మహనీయ అలీ ఆయన్ని చూసి, "అబూ సుఫ్యాన్! నేనో ఉపాయం చెబుతాను, నీవు వంశం పరంగానూ మీ తెగకు కూడా

నాయకుడివి, మక్కా వాసుల నాయకుడివే కాక వారి ప్రతినిధివి కూడా. నీకు ఎటువంటి పరిచయం అవసరం లేదు. లెయ్యి, నేరుగా మస్జిద్‌కు వెళ్ళి బిగ్గరగా ప్రకటించు, 'నేను ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి వచ్చాను, ప్రవక్తను కలిసి నా ఉద్దేశం తెలిపాను, మా నగరానికి తిరిగి వెళ్ళి పోతున్నాను' అని" సలహా ఇచ్చారు.

అబూ సుఫ్యాన్‌కు ఈ మాట నచ్చింది, అలాగే చేసి తిరిగి వెళ్ళిపోయారు. అక్కడికి వెళ్ళి జరిగినదంతా మక్కా నాయకులకు వినిపిస్తే, వారు, "మా అభిప్రాయంలో అలీ నిన్ను ఎగతాళి పాల్జేశాడు" అని కొట్టి పారేశారు.

## మరో సంఘటన

ప్రవక్త మహనీయులు మక్కా పైకి సైన్యం తీసుకు వెళ్ళే ముందు మరో సంఘటన జరిగింది. మహనీయ హాతిబ్ బిన్ అబీ బల్తఅ ఓ రహస్య పత్రం మక్కాలో ఖురైష్ నాయకులకు ఓ ఆటపాటల స్త్రీ ద్వారా పంపించారు. ఈ విధంగా వారు తన సుహృద్భావానికి ముగ్ధులయి మక్కాలో ఉన్న తన బంధు వర్గాలకు హాని కలిగించకుండా ఉంటారని ఆశించారు. కాని ఆ విషయం దైవికంగా ప్రవక్తశ్రీకి తెలిసిపోయింది.[1]

ఆయన వెంటనే మహనీయ అలీ, మహనీయ మిక్దాద్ బిన్ అస్వద్, మహనీయ జుబైర్ ని ఆ స్త్రీని వెంటాడి మదీనాకు 12 మైళ్ళ దూరాన ఆమెను పట్టి ఆ లేఖ తీసుకు వచ్చేందుకు పంపించారు. ఈ బృందం అక్కడికి చేరేసరికి స్త్రీ అయితే కానవచ్చింది కాని లేఖను గురించి అడిగితే తన వద్ద లేదని బుకాయించింది. వీలయినంత వరకు వెదికారు, దొరకలేదు. అప్పుడు మహనీయ అలీ కఠినంగా బెదిరించారు, ఇవ్వక పోతే బట్టలు తీసి చూస్తామని, చంపుతామని. ఇక తప్పదని ఆమె తన జడలోనుంచి లేఖను తీసి అప్పగించింది.

వారు ఆ లేఖ తీసుకుని ప్రవక్తశ్రీ వద్దకు వచ్చారు. అందులో దైవ సందేశహరులు మక్కాపైకి దండెత్తే సన్నాహాలు చేస్తున్నారు అని ఉంది. ✤

---

1. *ఇక్కడ ఓ వివరణ అవసరమని భావిస్తున్నాము. మహనీయ హాతిబ్ ని ఈ విషయాన్ని విచారించగా ఆయన ఇలా చెప్పారు: "నా ఆప్తులు మక్కాలో ఉన్నారు. వారి బంధువులు ఎవరూ మక్కాలో లేరు ఆపదలో కాపాడటానికి. వారికి రక్షణ ఇచ్చేవారు కూడా లేరు. నేనేదో ఆవేదనతో ఖురైష్ నాయకులకు ఆ లేఖ వ్రాశాను. దాన్ని పురస్కరించుకుని అయినా ఖురైషీలు నా తల్లి, సోదరుడు, భార్యా బిడ్డలకు హాని కలిగించరని. కాని నేనిప్పుడు పశ్చాత్తాపంతో కుమిలి పోతున్నాను. తప్పయి పోయింది. ఘోరమయిన పాపం చేశాను. దైవమే నన్ను క్షమించాలి."*
*ఈ వినతి వినగానే ప్రవక్త మహనీయులు, హాతిబ్ చెప్పేది నిజమే అని సాక్ష్యం ఇచ్చారు. హాతిబ్ తోనూ 'నేను నిన్ను క్షమిస్తున్నాను' అన్నారు.*

---


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.



# మలిక్ వాయజుల్ హఖ్

(1913-1942)

57





9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**ఆంగ్లేయుల్లారా** మా దేశం వదిలిపెట్టి వెళ్ళండి, అంటూ గర్జించిన భారతీయుల బలమైన ఆకాంక్షకు ప్రతిస్పందనగా పెల్లుబికిన 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొని, తన సాహసోపేత చర్యలతో ఆంగ్లేయుల అతిశయాన్ని, అహంకారాన్ని తుత్తునియలు చేసిన అమర యోధుడు మలిక్ వాయజుల్ హఖ్ 1913లో నియామత్ నబీ ఇంట జన్మించారు. ప్రస్తుతం అరవాల్‌గా పిలువబడుతున్న అప్పటి గయా జిల్లా, కుర్తా పోలీసు సర్కిల్ పరిధిలోగల మేడ్నిపూర్ ఆయన స్వస్థలం. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాల పట్ల ఆయన ఆకర్షితులయ్యారు. గయా కేంద్రంగా స్వాతంత్ర్య సమర యోధులు సాగిస్తున్న పోరాట కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మంచి ధైర్యశాలి, సాహసిగా పేరు గాంచారు. జాతీయోద్యమానికి నాయకత్వం వహిస్తున్న భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం తీసుకున్న ఆయన థానా కాంగ్రెస్ కమిటీ నాయకత్వం చేపట్టారు. అతివాద భావజాలం కలిగిన మలిక్ వాయజుల్ హఖ్ తన మిత్రబృందంతో కలసి గయా జిల్లా పంచన్‌పూర్ బ్రిడ్జిని పేల్చివేయడానికి విఫల ప్రయత్నాలు చేశారు. ఆయన గృహం విప్లవ కార్యకలాపాలకు రహస్య కేంద్రమయ్యింది. ఆయన అతివాద కార్యాచరణ పట్ల ఆగ్రహించిన ఆంగ్లేయాధికారులు ఆయన ఇంటి మీద పలుమార్లు దాడులు జరిపి సోదాలు నిర్వహించారు. ఆయనను గయా, ఫుల్‌వారి షరీఫ్, బక్సర్ తదితర కారాగారాల్లో పలుమార్లు నిర్బంధించారు. 1942 ఆగస్టులో యూసుఫ్ జాఫర్ మెహర్ అలీ సృష్టించిన 'క్విట్ ఇండియా' నినాదాన్ని స్వీకరించి, 'క్విట్ ఇండియా ఉద్యమం' ప్రారంభించమని భారత జాతీయ కాంగ్రెస్ ఆగస్టు ఎనిమిదిన పిలుపు ఇచ్చింది. ఆ పిలుపు మేరకు ఆగస్టు తొమ్మిదిన కుర్తా పోలీసు స్టేషన్ మీదకు మలిక్ వాయజుల్ హఖ్ ఆయన సహచరులు అత్యంత రహస్యంగా ఎగబ్రాకి, యూనియన్ జాక్ దించేసి ఆ స్థానంలో భారత జాతీయ కాంగ్రెస్ పతాకాన్ని ఎగురవేశారు. ఈ చర్యతో దిగ్భ్రాంతికి గురైన పోలీసులు తేరుకుని మాలిక్ ఆయన సహచరుల మీద విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో మాలిక్ సహచరులలోని శ్యాం బిహారి బేణి పూరి అక్కడికక్కడే నేల కూలగా, తీవ్రంగా గాయపడిన మలిక్ వాయజుల్ హఖ్‌ను ఆసుపత్రికి తరలించారు. విప్లవోద్యమకారుల గుట్టుమట్టులను రాబట్టడానికి ఆంగ్లేయాధికారులు శత విధాల ప్రయత్నం చేసినా ఆయన ఏ మాత్రం లొంగలేదు. ఆగ్రహించిన ఆంగ్లేయాధికారులు ఆయనకు సరైన చికిత్స అందించక పోవడంతో వీరయోధుడు మలిక్ వాయజుల్ హఖ్ 1942 ఆగస్టులో కన్నుమూసారు. ✤



# కృతజ్ఞతగా మెలగండి!

- నసీరా బేగం

**మనిషి** జీవితంలో కృతజ్ఞత అనే గుణం ఒక ఉత్తమ సుగుణం; అది అతని జీవిత రథానికి ప్రాణం వంటిది. కాని మనిషి దైవాను గ్రహాల పట్ల అతి తక్కువగా కృతజ్ఞుడై ఉంటాడు. వాస్తవానికి అసంఖ్యాకమైన అనుగ్రహాలు అతని చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. వాటి ద్వారా అతను ప్రయోజనాలు పొందుతూ ఉంటాడు. అయినప్పటికీ అతను వాటిపై తన దృష్టిని సారించడు. ఈ విషయాన్ని ఖుర్‌ఆన్ గ్రంథంలో ఇలా ప్రస్తావించబడింది :

భూమినీ, ఆకాశాలను సృష్టించినవాడూ, ఆకాశం నుండి నీళ్లను కురిపించినవాడూ, దానిద్వారా మీ ఆహారం కొరకు రకరకాల ఫలాలను సృష్టించినవాడు, తన ఆజ్ఞానుసారం సముద్రంలో నడవాలని పడవను మీ సేవకై మీకు లోబరచినవాడు, నదులను మీ సేవకై మీకు లోబరచినవాడూ, నిరంతర ప్రయాణం చేస్తూ పోతున్న సూర్యచంద్రులను మీ సేవకై లోబరచినవాడూ, రాత్రినీ, పగలునూ మీ సేవకై లోబరచినవాడూ, మీరు అడిగిన సమస్తాన్నీ మీకు ఇచ్చినవాడూ అల్లాహ్‌యే. మీరు గనక అల్లాహ్ అనుగ్రహా లను లెక్కించదలిస్తే లెక్కించలేరు. నిజంగా మానవుడు నీతి లేనివాడు, కృతఘ్నుడు. (14: 32-34)

కారుణ్య ప్రభువైన అల్లాహ్ మనిషిని పుట్టించి ఇట్టే వదిలి వేయలేదు. అతని జీవితానికి సంబంధించిన ఎన్నో ఆహార పదార్థా లను, అతనికి అవసరమైన అన్ని వసతులను ఏర్పాటు చేశాడు. ఇవన్నీ మనిషికి అడగకుండానే అల్లాహ్ అతనికి ప్రసాదించాడు. అంతేకాదు, మనిషి అల్లాహ్‌ను అనుమతి అడగవలసిన అవసరాన్ని కూడా ఆయన పెట్టలేదు. మనిషి వాటిని తన అవసరానుగుణంగా వాడుకునే వీలును కూడా కల్పించాడు. వాటికి సంబంధించిన జ్ఞానాన్ని కూడా ప్రసాదించాడు. కాని మనిషి బహు తక్కువగా అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతాడు.

అల్లాహ్ ఈ విషయాన్ని కూడా తన గ్రంథంలో ఇలా ప్రస్తావిం చాడు : వాస్తవం ఏమిటంటే, అల్లాహ్ మానవుల పట్ల అత్యంత అనుగ్రహం కలవాడు. కాని చాలామంది కృతజ్ఞతలు చూపరు. (2: 243)

దైవప్రవక్తలందరూ అల్లాహ్‌కు ఎంతో కృతజ్ఞతలర్పించేవారు. ఈ విషయాన్ని అల్లాహ్‌యే తెలియజేశాడు : వారు ఎన్నో కష్టమైన పరిస్థితులన్నీ ఎదుర్కొన్నప్పటికీ వారు ఎల్లప్పుడూ దైవారాధన లోను, దైవనామస్మరణలోను లీనమై ఉండేవారు. అంతేకాదు, అన్ని పరిస్థితుల్లోను అల్లాహ్‌కు కృతజ్ఞతలర్పిస్తూ ఉండేవారు. ఉదాహరణకు :

హజ్రత్ సులైమాన్ (అ) గురించి కూడా ఇలా ఉంది : ప్రభూ! నన్ను అదుపులో ఉంచు, నీవు నాకూ, నా తల్లిదండ్రులకూ చేసిన ఉపకారానికి నేను కృతజ్ఞతలు తెలుపుతూ ఉండేందుకు, నీకు నచ్చిన మంచి పనులు చేస్తూ ఉండేందుకు. నీ కారుణ్యంతో నన్ను సజ్జనులైన నీ దాసులలో చేర్చు.'' (27: 19)

కారుణ్యమూర్తి మహాప్రవక్త ముహమ్మద్(స) మనిషి హృదయంలో కృతజ్ఞతా భావన పెంపొందేందుకు ఒక చిన్న ఉదాహరణ ద్వారా తెలియజేశారు. మనిషి ప్రాపంచిక భోగభాగ్యాలు, ధనరాశుల విషయంలో దాని ప్రభావానికి లోనవుతూ ఉన్నట్లయితే, ఈ విషయంలో తనకంటే ఉన్నతమైన వ్యక్తులను చూడకుండా తన కంటే తక్కువగా ఉన్నవారిని చూసినట్లయితే అతని హృదయంలో కృతజ్ఞతా భావం పెల్లుబుకుతుంది అని.

షేక్ సాది(ర) తన ఒక ప్రత్యేక సంఘటనను ఇలా ప్రస్తావించారు: ఒకసారి నా దగ్గర చెప్పులు లేకుండాపోయాయి. చెప్పులు కొనుక్కుందామంటే నా దగ్గర డబ్బులు కూడా లేని పరిస్థితి. నాకు చాలా బాధ కలిగింది. ఆ బాధతోనే నేను మసీదుకు వెళ్ళి ఒక మూలన కూర్చున్నాను. అంతలో అక్కడ ఒక వ్యక్తి పాకుకుంటూ మసీదు లోపలికి వచ్చాడు. అతనికి రెండు కాళ్ళూ పుట్టుకతోనే లేవు. అతన్ని చూసి నా హృదయం బరువెక్కింది. కృతజ్ఞతా భావంతో నిండిపోయాయి. నా హృదయం నన్ను ఓదార్చింది. నీ కాళ్ళకు చెప్పులు మాత్రమే లేవు కదా! అతనికైతే కాళ్ళు కూడా లేవు. అతనికంటే నీవు ఎంతో ధన్యుడివి అని. వెంటనే నేను పశ్చాత్తాపపడ్డాను. అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నాను. క్రింది వారిని చూసిన ప్రయోజనాలు ఈవిధంగా ఉంటాయి.

ప్రతి మనిషి ఒకసారి తలవెంట్రుకల నుంచి కాలిగోటి వరకు జ్ఞాన దృష్టితో తనను తాను చూసినట్లయితే అతని ఒక్కొక్క వెంట్రుక, ఒక్కొక్క అవయవం అల్లాహ్ కారుణ్యంతో నిండిపోయి ఉంటుంది. ఉదాహరణకు, అల్లాహ్ మనకు కళ్ళిచ్చాడు చూడటానికి. చెవులిచ్చాడు వినటానికి. మెదడిచ్చాడు ఆలోచించ టానికి. నాలుకిచ్చాడు మాట్లాడటానికి. కాళ్ళిచ్చాడు నడవటానికి. కేవలం ఇవి పైకి కనిపించే కొన్ని అవయవాలు మాత్రమే. ఒకవేళ అల్లాహ్ మన శరీరంలో ఈ అవయవాలను అమర్చి వాటికి శక్తిని గనక ఇవ్వకపోయినట్లయితే అవి శరీర అలంకరణకు మాత్రమే పనికొస్తాయి గాని శరీరాన్ని నడపటానికి ఎంతమాత్రమూ అవి పనికి రావు. ఆ మనిషి వికలాంగునిగా ఉండిపోతాడు. ఒకవేళ మనిషి శరీరం మొత్తం ఎంతో అందంగా తీర్చిదిద్ది ఆరోగ్యాన్ని గనక ఇవ్వకపోయినట్లయితే మనిషి అనారోగ్యంతో పూర్తి జీవితాన్ని గడపవలసి ఉంటుంది. ఆ జీవితం ఒకవైపు అతనికి మరోవైపు అతని వారికి అధిక భారమైపోతుంది. ఈ విధంగా మనం వ్రాసుకుంటూ పోతే ఒక పెద్ద గ్రంథమే తయారవుతుంది. కారుణ్య ప్రభువైన అల్లాహ్ మనిషిని భూమిపై పుట్టించక ముందే అతని జీవితానికి కావలసినవన్నింటినీ సృష్టించాడు. ఆ తరువాత మనిషిని సృష్టించాడు. ఇంకా తల్లి గర్భంలోనే అతని అవయవాల న్నింటినీ సృష్టించాడు. అతను బయట ప్రపంచంలో అడుగు పెట్టినప్పటి నుంచీ అతనికి అవసరమైన వాటినన్నింటినీ నేర్పాడు. వీటన్నింటిని గురించి ఈ విధంగా ఆలోచించినట్లయితే ఎవడైనా అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోకుండా ఉండగలుగుతాడా?

మనిషి ప్రాపంచిక భోగభాగ్యాల విషయంలో తనకంటే తక్కువగా ఉన్న వారిని దృష్టిలో ఉంచుకోవాలి. ధార్మిక విషయంలో తనకంటే అధికంగా, ఉన్నతంగా ఉన్నవారిని చూడాలి. అప్పుడు తప్పకుండా మనిషి హృదయంలో కృతజ్ఞతా భావం కలుగుతుంది.

కారుణ్యమూర్తి మహాప్రవక్త ముహమ్మద్(స) అల్లాహ్ అత్యధికంగా కృతజ్ఞతలు తెలుపుతూ ఉండేవారు. ఇంకా ఆయన తన సహచరులు, ఇస్లామ్ ధర్మ అనుయాయులు కూడా అల్లాహ్‌కు అత్యధికంగా కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉండాలని కోరేవారు. మీరుగనక అల్లాహ్ అనుగ్రహాల పట్ల కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉన్నట్లయితే అల్లాహ్ మీ అనుగ్రహాలను ఇంకా అధికం చేస్తాడు. అల్లాహ్ మీ ఆచరణలను ఎంతో విలువనిస్తాడు. ఇంకా వారు తెలిపే ఈ కృతజ్ఞతలు ప్రళయదినాన ఆచరణలు తూయ బడుతూ ఉన్నప్పుడు అవి సత్కర్మల త్రాసు పళ్లెం బరువును పెంచుతాయి అని. వాస్తవానికి అల్లాహ్‌కు మేము తెలిపే కృతజ్ఞతల అవసరం ఎంత మాత్రమూ లేదు. దానిద్వారా ఆయనకు ఎటువంటి లాభమూ లేదు. కృతజ్ఞతలు తెలుపక పోవడం ద్వారా ఆయనకు ఎలాంటి నష్టమూ లేదు. ఇందులో మనకు మాత్రమే ప్రయోజనం ఉంటుంది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; మీరు నన్ను జ్ఞాపకం చెయ్యండి. నేను మీకు జ్ఞాపకం ఉంచుకుంటాను. నాకు కృతజ్ఞతలు తెలుపండి. కృతఘ్నుతకు పాల్పడకండి.

మనిషిలో రుగ్మతలు చోటు చేసుకోవటానికి ఒక మూల కారణం కృతఘ్నుత. కనుక కృతజ్ఞతా పూర్వకంగా ఉండండి. మనశ్శాంతిని పొందండి.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# దైవ దూషణ – భావ స్వేచ్ఛ

# ఇస్లాామ్

- ముహమ్మద్ షరీఫ్

**నూతన** నాస్తికత్వం దైవదూషణపై కొన్ని ప్రత్యేక అభిప్రాయాలను కలిగి ఉంది. భావ స్వేచ్ఛను ఆధునిక సమాజం హక్కుగా భావిస్తుంది.

స్వేచ్ఛగా భావవ్యక్తీకరణకు అవకాశం లేకపోవడం అనేది మధ్య యుగ లక్షణమని, దానిని అంగీకరించలేమని ఆధునిక సమాజం భావిస్తుంది. అలాంటి సమాజం అనాగరిక సమాజంగా పేర్కొంటుంది. ఫ్రెంచి విప్లవ మూల సూత్రమైన పరాకాష్ట స్థాయి స్వేచ్ఛను, మతాతీత ధోరణులను ప్రగతి పేరుతో ప్రజల ముందుంచుతుంది. పాశ్చాత్య భావజాలాన్ని అందల మెక్కించిన ఆధునిక సమాజం వారి ఆలోచనలను యధాతథంగా అంగీకరిస్తుంది.

దైవదూషణ- భావస్వేచ్ఛ అనే విషయంలో నూతన నాస్తికుల ఆలోచన ఏమిటంటే మనిషి అపరిమితమైన భావస్వేచ్ఛను కలిగి ఉంటాడు. కనుక...

ఎవరికైనా అనుకూలంగా లేదా ప్రతికూలంగా తమ భావనలను వ్యక్తపరచవచ్చు. ఈ స్వాతంత్ర్యాన్ని అందరూ గౌరవించాలి. ఒక్కోసారి మతపరమైన వ్యక్తులను, మతాలను, ఆరాధ్యులను కూడా అవమానపరచడాన్ని వీరు సమర్థిస్తారు.

నూతన నాస్తిక ధ్వజవాహకులు వివిధ పుస్తకాల ద్వారా దైవదూషణపై తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తూ వితండవాదన చేస్తారు.

దీనిపై వీరు తమ పుస్తకాలలో వివరంగా రాశారు.

రిచర్డ్ డాకిన్స్ The God delusionలోనూ, క్రిస్టోఫర్ హిచెన్స్ The God is not great అనే పుస్తకంలో దైవదూషణ తమ జన్మహక్కుగా భావిస్తూ, దైవ దూషణకు ముస్లింల నుండి వచ్చిన ప్రతిస్పందనను సంకుచిత దృక్పథంగానూ, మానవ హక్కులకు వ్యతిరేక భావనగానూ ప్రచారం చేస్తున్నారు.

భావప్రకటనా స్వేచ్ఛ విషయంలో పశ్చిమ దేశాల ఆలోచనలు ఇలా ఉన్నాయి.

కేథలిక్ ఎన్‌సైక్లోపీడియా ప్రకారం,

Ability to talk without any restrictions or external control అని అంటుంది.

➢ UNHRC ప్రకారం ప్రతి మనిషీ తనకు నచ్చిన అభిప్రాయాలను వ్యక్తపరిచే స్వేచ్ఛను కలిగి ఉంటాడు.

➢ విశ్వమానవ హక్కుల ప్రకటన ప్రకారం

ఒక మతాన్ని అనుసరించే, విడిచిపెట్టే స్వేచ్ఛ అందరికీ ఉంటుంది. నిన్ను ఇతరులు ఎలా గౌరవించాలనుకుంటావో నీవూ ఇతరులను అలానే గౌరవించాలి.

## భావ ప్రకటనా స్వేచ్ఛ - ఇస్లాం

➢ మానవుడు ఈ లోకంలో మంచి పనులు చేస్తాడో లేదో అని పరీక్షించడానికి పంపించబడ్డాడు. కనుక మనిషి మంచి పనులు చేయాలి.

➢ ఈ భూమిపై సంస్కరణ జరిగిన తర్వాత దానిలో ఉపద్రవం సృష్టించరాదు. కనుక మనిషి చేష్టలు కల్లోల కారకమైనవిగా ఉండరాదు.

➢ మానవునికి అల్లాహ్‌ను విశ్వసించే, మంచిని ఆదేశించే, చెడు నుండి వారించే, మానవులను సంస్కరించే స్వేచ్ఛ తప్పక ఉండాలి.

➢ ధర్మంలో బలవంతం లేదు.

➢ ఇతరులు దైవాలుగా ఆరాధించే వారిని కించపరిచే హక్కు లేదు.

➢ ఇతరులను కించపరచడం, ఫేక్ వార్తలు వ్యాప్తిచేయడం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ క్రిందకు రాదు.

➢ మంచిని వ్యాపింపచేయడానికి స్వేచ్ఛ ఉండాలి, చెడుల వ్యాప్తి కొరకు కాదు.

➢ స్వేచ్ఛ సమాజ సంస్కరణకే కానీ, అవినీతి వ్యాప్తి కొరకు కాదు.

ముహమ్మద్ (స) పై శతాబ్దాలుగా దూషణ పర్వం కొనసాగుతుంది. 1988లో సెటానికి వెర్సెస్ ద్వారా,1993 లజ్జ ద్వారా, 2005లో డెన్మార్క్ పత్రికలో వచ్చిన కార్టూన్ల ద్వారా, 2022లో మనదేశంలో ఒక పార్టీ ప్రతినిధి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు ఇలా సంఘటన ఏదైనా ముహమ్మద్ (స) వారి వ్యక్తిత్వంపై దూషణకు పాల్పడిన సందర్భాలు మనకు ఇంకా గుర్తున్నాయి. ఇలా వీరు భూమిపై కల్లోల జనకుల పాత్రను పోషించడం మనం గమనిస్తాము.

## ముహమ్మద్ (స)పై దూషణ అనాగరికం

ముహమ్మద్(స) నైతికతను పరాకాష్ట స్థాయిలో నిలిపిన నేత. మానవుని సకల జీవన రంగాలలో అత్యుత్తమ మార్గదర్శి ఆయన.

కారుణ్యం, సహనం, స్థిరచిత్తం, శతృవులను క్షమించే గుణం, సమాజ సంస్కరణ, మంచి స్థాపన, చెడు నిర్మూలన, తెగల ఐక్యతలకు కృషి చేయడం ద్వారా ఒక పరిపూర్ణ మానవుని స్థాయి ఈ ప్రపంచంలో ఆయనకు మాత్రమే దక్కింది. అలాంటి మహా మనీషిని కించపరచడం ఖచ్చితంగా ఆయన అనుయాయులకు బాధ కలిగించే విషయం కావడంలో ఆశ్చర్య పోవలసిన అవసరం లేదు.

## పాశ్చాత్యుల ద్వంద్వ వైఖరి

♦ ముస్లింలు దైవదూషణను భరించాలని, ముహమ్మద్ (స)పై దూషణ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు ప్రతిబింబంగా భావించాలని సుద్దులు చెప్పిన డెన్మార్క్ పత్రిక 2003లో ఈసా(అ) పై కార్టూన్‌ను ప్రచురించడానికి ససేమిరా అనడం.

## మరి ఇప్పుడు ఏమైంది భావప్రకటనా స్వేచ్ఛ?

♦ హొలోకాస్ట్ తిరస్కరణ అనేది నేటికీ పాశ్చాత్య దేశాలలో బ్లాస్ఫెమీగా పరిగణించబడుతుంది.

హిట్లర్ అరవై లక్షల మంది యూదులను చంపడాన్ని ఎవరు విమర్శించినా అది నేటికీ తప్పే.

♦ 1984లో స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రియా, జర్మనీ దేశాలు హొలోకాస్ట్ తిరస్కరణను (దూషణను) నిషేధించాయి.

♦ జర్మనీలో హొలోకాస్ట్ దూషణకు ఐదేళ్ళు, ఆస్ట్రియాలో పదేళ్ళు జైలు శిక్షలు విధించబడతాయి. మరి ఈ దేశాల్లో భావప్రకటనా స్వేచ్ఛ ఉన్నట్లా? లేనట్లా?

♦ 1937 స్విట్జర్లాండ్ చట్టం ప్రకారం ఎవరైనా వ్యక్తిని కానీ, సమూహాన్ని కానీ, జాతిని కానీ అగౌరవపరచడం శిక్షార్హమైన నేరంగా పరిగణించబడుతుంది. మరి ఈ చట్టం ముహమ్మద్(స)ను దూషించే వారికి ఎందుకు వర్తించదు?

♦ జర్మనీకి చెందిన ఫెడరల్ ప్రాసిక్యూటర్ ఇరాన్ మాజీ ప్రెసిడెంట్ హొలోకాస్ట్ దూషణను చేయడం ద్వారా మరణించిన వారిని అవమానపరిచారని, ఒక జాతిని హీనపరచారని వ్యాఖ్యానించడం గమనార్హం.

♦ 1999లో సల్మాన్ రష్దీ రాసిన ఇస్లాం దూషణ పుస్తకంపై ఇంగ్లాండ్ ముస్లింలు అక్కడి కోర్టును ఆశ్రయించి అక్కడి బ్లాస్ఫెమీ చట్టం ప్రకారం రష్దీకి శిక్ష విధించాలని కోరగా ఈ చట్టం కేవలం ఈసా (అ)ని దూషించిన వారికి వర్తిస్తుంది తప్ప ముహమ్మద్(స)ని దూషించిన వారికి వర్తించదని చెప్పడం గమనార్హం.

ఈ విధంగా నూతన నాస్తికులు ఇస్లాంను దూషించడాన్ని మాత్రమే హక్కుగా భావిస్తూ హొలోకాస్ట్ లాంటి దమన కాండలను తిరస్కరించిన వారికి శిక్షలు విధించడం ద్వారా తమ కపట నైజాన్ని బయటపెట్టుకున్నాయి.

డాకిన్స్ ఒక అడుగు ముందుకు వేసి ముస్లింలు పరలోకంపై నమ్మకం కలిగి ఉంటారు కదా, దైవదూషణపై ఇప్పుడే ఎందుకు ప్రతిస్పందిస్తున్నారు? దైవదూషణ చేసినవారిని పరలోకంలో దేవుడే శిక్షిస్తాడు కదా! అని గడుసుగా వాదిస్తాడు. ఐతే దైవ దూషణకు సమాధానం ఇవ్వడం కూడా భావ స్వేచ్ఛలో భాగమని ఆయన మర్చిపోయాడు.

పరలోకాన్ని నమ్మని నూతన నాస్తికులు పరలోకం గురించి మాట్లాడడం వారి సైద్ధాంతిక బలహీనత అని చెప్పక తప్పదు.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ నైతిక పథకం
సహజీవన భావనల సొపురాయి గీటురాయి వారపత్రిక




**అర్షియా, విజయవాడ**

**నేడు** మనం ఏఐ యుగంలో ఉన్నాము. కృత్రిమ మేథస్సును సృష్టించుకున్న మనిషి ఏఐ టెక్నాలజీతో అద్భుతాలను సృష్టిస్తు న్నాడు. కానీ మనిషిని సృష్టించిన అల్లాహ్‌ను గుర్తించకపోవడం వల్ల నైతికంగా పతనమవుతున్నాడు. పెరుగుతున్న కల్తీ, అవినీతి, హ్యూమన్ ట్రాఫికింగ్, హత్యలు, అత్యాచారాలు, మోసం, దగా, డ్రగ్స్ ఇవన్నీ సమాజాన్ని నైతిక సంక్షోభానికి దారితీస్తున్నాయి. ఖుర్ఆన్ గ్రంథం నేటి నైతిక సంక్షోభానికి, పతనమవుతున్న మానవీయ విలువలకు చక్కని పరిష్కారాన్ని చూపిస్తుంది. ఖుర్ఆన్ బోధనలను పొందినప్పుడే మనిషి పరిపూర్ణుడవుతాడు. ఖుర్ఆన్ గ్రంథం బోధించే నైతిక, మానవీయ విలువల్ని గురించి తెలుసుకుందాం...

ఖుర్ఆన్ జీవన గ్రంథం. జీవిత ప్రయాణంలో అడుగడుగునా దిక్సూచిలా దారి చూపుతుంది. ఖుర్ఆన్ బోధనలు సాఫల్యానికి బాటలు పరుస్తాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ప్రాపంచిక జీవితంలోనే కాదు పరలోక జీవిత సాఫల్యానికి మార్గ నిర్దేశనం చేస్తోంది. మనిషి ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు? ఏం చేయాలి? ఏం చేయకూడదు? ఇలా అన్ని సందర్భాల్లోనూ సమాధానం చెబుతుంది. ఆదేశాలు.. ఉపదేశాలు.. అనే రెండు కేటగిరీల్లో ఉన్న ఖుర్ఆన్ బోధనలు ఆచరణలో పెడితే జీవితం స్వర్గధామమవుతుందంటారు ఉలమాలు. అనంత కరుణా మయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ మాటలన్నీ మనిషి మేలుకోసమేనని ఖుర్ఆన్ చదివితే బోధపడుతుంది. ఈ ప్రపంచంలో ఎన్నో మతాలున్నాయి. ఒక్కో మతానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. ఇస్లామ్ ధర్మం ప్రత్యేకత ఏమిటంటే 'నైతికత'. ఖుర్ఆన్ బోధించే నీతి, నియమాల, నైతిక విలువలు గురించి ఈ సందర్భంగా తెలుసుకుందాం.

### మంచి పనుల్లో తోడ్పడండి..

విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతులకు తోడ్పడండి. (9:119)

### సహనం వహించండి..

విశ్వాసులారా! సహనంతో వ్యవహరించండి. (3:200)

కష్టాలను ఓర్చుకోండి.. ఏ కష్టం కలిగినా దానికి సహనం వహించు. (31:16)

లోకులు కల్పించే మాటల పట్ల సహనం వహించి, మంచితనంతో వారి నుండి వైదొలగిపో.(73:10)

### సహనానికి బహుమానం..

తమ సహనానికి ప్రతిఫలంగా మహోన్నతమైన సౌధాలను పొందేవారు వారే. అక్కడ గౌరవ మర్యాదలతో, శాంతివచనాలతో వారికి స్వాగతం పలుకబడు తుంది. వారు కలకాలం అక్కడనే ఉంటారు. ఎంత మంచిది ఆ స్థలం, ఎంత మంచిది ఆ నివాసం. (25:75)

## పిసినారితనమూ వద్దు.. వృధా చేయరాదు

మీ చేతిని మెడకు బంధించి ఉంచకండి, దానిని పూర్తిగా స్వేచ్ఛగానూ వదలి పెట్టకండి. అలాచేస్తే నిందల పాలవుతారు, దిక్కులేని వారవుతారు. (17:29)

ఖర్చుపెడితే, దుబారాగానూ ఖర్చు పెట్టకుండా, లోభత్వాన్నీ ప్రదర్శించకుండా ఈ రెండు తీవ్రవైఖరుల మధ్య సమతూకాన్ని పాటించేవారు. (25:67)

## పిసినారితనాన్ని వీడండి

అల్లాహ్ తన అనుగ్రహాన్ని విరివిగా ప్రసాదించినప్పటికీ పిసినారితనం చూపేవారు, ఈ పిసినారితనం తమకు మేల్కొనదని భావించ రాదు. కాదు, ఇది వారికొరకు ఎంతో హానికరమయినది. వారు తమ లోభత్వంతో కూడబెడుతూ ఉన్నదే ప్రళయం నాడు వారి పాలిట కంఠపాశం అవుతుంది. (3:180)

## ఉపకారం చేయాలి

అల్లాహ్ నీకు ఉపకారం చేసిన విధంగానే నీవూ ఉపకారం చేయి. (28:77)

## పవిత్రంగా ఉండాలి

తమ మర్మాంగాలను పరిరక్షించుకుంటారు, (23:5)

## అశ్లీలానికి దూరంగా ఉండండి

అశ్లీల విషయాల దరిదాపులకు కూడా పోకండి, బహిరంగమైనవైనా సరే లేక గోప్యమైనవైనా సరే. (6:152)

## క్షమాగుణం అలవర్చుకోండి

వారిని క్షమించాలి, వారి(తప్పులను)ని ఉపేక్షించాలి. మిమ్మల్ని అల్లాహ్ క్షమించాలని మీరు కోరుకోరా? అల్లాహ్ గుణం ఏమి టంటే, ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను. (24:22)

ఎవరైనా సహనంతో వ్యవహరిస్తే, క్షమించివేస్తే, అది పెద్ద సాహసంతో, దృఢ సంకల్పంతో కూడుకున్న పని. (42:43)

## కోపాన్ని దిగమ్రింగాలి

కోపాన్ని దిగమ్రింగేవారు, ఇతరుల తప్పులను క్షమించేవారు - ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్ కు ఎంతో ఇష్టం- (3:134)

## మృదు హృదయం

(ప్రవక్తా!) అల్లాహ్ అనంత కరుణ వల్లనే నీవు వారిపట్ల మృదుస్వభావుడవు అయ్యావు. నీవేగనక కర్కశుడవు, కఠిన హృదయుడవు అయినట్లయితే వారందరూ నీ చుట్టుపక్కల నుండి దూరంగా పోయేవారు. (3:159)

## చెడును శ్రేష్టమైన మంచితో తొలగించాలి

ప్రవక్తా! మంచీ, చెడూ ఒకటి కావు. నీవు చెడును శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీ పట్ల శత్రుభావం కలవాడు నీకు ప్రాణస్నేహితుడై పోవటాన్ని నీవు గమనిస్తావు. (41:35-36)

## విర్రవీగకూడదు

ప్రజలతో ముఖం ప్రక్కకు త్రిప్పి మాట్లాడకు, భూమిపై నిక్కుతూ నడవకు. అహంభావి, బడాయికోరు అయిన ఏ వ్యక్తినీ అల్లాహ్ ప్రేమించడు. నీ నడకలో సమమైన తూకం పాటించు, నీ కంఠస్వరాన్ని కొంచెం తగ్గించు, అన్ని స్వరాల కంటే అతి చెడ్డ స్వరం గార్దభాల స్వరం. (31:18)

## అబద్ధాలు వద్దు

అబద్ధపు మాటలు పలక్కండి, (22:30)

## ఇచ్చిన మాట తప్పకండి

వారు అల్లాహ్ ఎడల చేసిన ఈ ప్రమాణభంగం కారణంగా, వారు చెబుతూ వచ్చిన అబద్ధం కారణంగా, అల్లాహ్ వారి హృదయాలలో కాపట్యాన్ని నాటాడు. (9:77)

## నమ్మకద్రోహానికి పాల్పడవద్దు

నమ్మకద్రోహం చేసినవాడు ప్రళయంనాడు తన నమ్మకద్రోహంతో పాటు హాజరవుతాడు. (3:161)

## అసూయ వద్దు

అసూయాపరుడు అసూయపడే టప్పటి కీడు నుండి శరణు కోరుతున్నాను. (113:5)




అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**89 ఆయత్‌లు**

# 43. అజ్ జుఖ్రుఫ్

59 – 61 మర్యమ్ కుమారుడు ఒక దైవదాసుడు తప్ప మరేమీ కాదు, అతనికి మేము మా బహుమానాలనిచ్చాము, బనీ ఇస్రాయీల్ కొరకు అతన్ని మా సృష్టి క్రియకు ఒక ఉదాహరణగా చేశాము.[53] మేము కోరుకుంటే మీ ద్వారా దైవదూతల్ని పుట్టించేవారము,[54] భువిలో వారు మీకు వారసులయ్యేవారు. అతను వాస్తవానికి ప్రళయానికి ఒక సూచన,[55] కనుక అందులో శంకకు లోనవకండి, నా మాటను అంగీకరించండి, ఇదే రుజుమార్గం.

53. సృష్టిక్రియకు ఉదాహరణగా చేయడం అంటే ఉద్దేశం, మహనీయ ఈసా (అ)ను తండ్రి లేకుండా పుట్టించడం, లోగడ ఎవ్వరికీ ఇవ్వనటువంటి, తరువాతనూ ఎవ్వరికీ ఇవ్వనటు వంటి మహిమలు ఆయనకు ఇవ్వడం. ఆయన మట్టితో పక్షిని చేసి అందులో ఊదగానే అది సజీవమయిన పక్షిగా ఎగిరి పోయేది. ఆయన పుట్టు గ్రుడ్డికి చూపు అనుగ్రహించేవారు, కుష్టురోగిని ఆరోగ్యవంతుణ్ణిగా చేసేవారు, చివరికి మృతుని సయితం బ్రతికించేవారు. ఇక్కడ పరమ ప్రభువు సెలవిచ్చేదేమిటంటే కేవలం ఈ అసాధారణమయిన జననం, ఈ మహత్తరమయిన మహిమల కారణంగా ఆయన్ని దాసునికన్నా అధికమని భావించడం, దేవుని కుమారునిగా ఎంచడం, ఆయన్ని ఆరాధించడం అంతా తప్పు. ఆయన కేవలం దైవదాసుడు తప్ప మరేమీ కాదు. ఆ దాసునికి మేము మా బహూకరణలను ఎన్నింటినో ప్రసాదించి సత్కరించాము. అలా అతన్ని మా సృష్టిక్రియకు ఒక ఉదాహరణగా చేశాము. (వివరాలకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం: సం.1, ఆలి ఇమ్రాన్: పాదసూచికలు 42– 44, సం.2, అన్ నిసా : పాద సూచి 190, అల్ మాఇద: పాద సూచికలు 40, ఆయత్ 110; సం.4, మర్యమ్ : పాద సూచికలు 15–21, అల్ అన్బియా:పాదసూచికలు 88–90, సం.5, అల్ మూ'మినూన్: పాదసూచి 43).

54. మరో అనువాదం ఇదీ సాధ్యమే, 'మీలో కొందరిని దైవదూతలుగా చేసేవారము.'

55. ఈ వాక్యాన్ని ఇలా కూడా అనువదించవచ్చు, అతను ప్రళయ జ్ఞానానికి ఒక సాధనం. ఇక్కడ ప్రశ్న (మూలంలోని ఇన్నహూలో 'హూ'='అది' లేదా 'అతను', అది అంటే ఉద్దేశం ఏమిటీ అన్నది. హజ్రత్ హసన్ బస్రీ, సయీద్ బిన్ జుబైర్ దృష్టిలో దీని ఉద్దేశం ఖుర్‌ఆన్ అన్నది. అంటే ఖుర్‌ఆన్ ద్వారానే మనిషి ప్రళయం ఎప్పుడు వస్తుందో అనే జ్ఞానాన్ని పొందగలడు అన్నమాట. కాని ఈ వ్యాఖ్యానం పూర్వోత్తరాలు పరిశీలిస్తే పూర్తిగా అతకదు. వచన క్రమంలో దీని సూచన ఖుర్‌ఆన్ వైపున ఉన్నట్లు చెప్పేందుకు ఆధారం కాగల ఒక్క సందర్భమూ కానరావడంలేదు. ఇతర వ్యాఖ్యాతలందరూ దాదాపు ఏకగ్రీవంగా అభిప్రాయపడేదేమిటంటే, దీని ఉద్దేశం మర్యమ్ కుమారుడు మహనీయ ఈసా (అ) అన్నది. పూర్వాపరాల రీత్యా కూడా ఇదే సరయినది. దీని తరువాత మరో ప్రశ్న ముందుకు వస్తుంది. మహనీయ ఈసా (అ) ను ప్రళయానికి సూచనగా, లేదా ప్రళయ జ్ఞానానికి సంకేతంగా ఏ భావంలో చెప్పడం జరిగింది? ఇబ్ను అబ్బాస్, ముజాహిద్, ఇక్రిమ, కతాద, సుద్దీ, జహ్హాక్, అబుల్ ఆలియా, అబూ మాలిక్ ప్రకారం దీని ఉద్దేశం, మహనీయ ఈసా(అ)మలి అవతరణ అన్నది. దీన్ని గురించి అనేక హదీసుల్లో సమాచారం అందజేయబడింది. ఆయత్ ఉద్దేశ్యం ఏమిటంటే, ఆయన మరోసారి ప్రపంచంలో ప్రభవించినప్పుడు ప్రళయం ఇక సమీపానే ఉందని తెలిసిపోతుంది. అయితే ఈ మహనీయుల ఘనమయిన విలువను గౌరవిస్తూనే ఈ అభిప్రాయాన్ని అంగీకరించడానికి వీల్లేదు. ఈ ఆయత్‌లో హజ్రత్ ఈసా మలి రాకను ప్రళయ సూచనగా లేదా దాని జ్ఞానానికి సాధనంగా తెలుపడం జరిగిందని ఒప్పుకోవడం కష్టమే. ఎందుకంటే దీని తరువాతి వచనం ఈ అర్థాన్ని గ్రహించేందుకు అడ్డువస్తోంది. ఆయన మలి రాక ప్రళయ జ్ఞానానికి సాధనం అన్నది, ఆ కాలంలో నివసించే వారికయితే కాగలదు లేదా ఆ తరువాత పుట్టిన వారికీ కావచ్చు. మక్కా తిరస్కారులకు అది ఏ విధంగా జ్ఞాన సాధనం కాగలదు? అలాంటప్పుడు వారిని సంబోధించి, 'కనుక అందులో శంకకు లోనవకండి' అని అనడం ఎంతవరకు సబబు. కనుక మా దృష్టిలో కొందరు ఇతర వ్యాఖ్యాతలు చేసిన వ్యాఖ్యానమే సరయినది: ఇక్కడ హజ్రత్ ఈసా తండ్రి లేకుండా పుట్టడం, ఆయన మన్నుతో పక్షిని చేయడం, మృతుని బ్రతికించడం ఇత్యాది వాటిని ప్రళయం సంభవమనడానికి ఒక ఆధారంగా చూపడం జరిగింది. దైవ వచనానికి భావమేమిటంటే, ఏ దేవుడయితే తండ్రి లేకుండా శిశువును పుట్టించగలడో, ఏ దేవుని దాసుడయితే మట్టి బొమ్మలో ప్రాణం పోయగలడో, మృతులను బ్రతికించగలడో అటువంటి దైవానికి మిమ్మల్ని, మానవులందరినీ మరణానంతరం మళ్ళీ సజీవంగా లేపి నిలబెట్టడం సాధ్యం కాదని ఎందుకు అనుకుంటున్నారు అన్నది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం
(కితాబుల్ మగాజీ)

### అధ్యాయం : 9
## బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారి విశిష్టత

**603)** హజ్రత్ అనస్(రజి) కథనం : హారిసా బిన్ సురాఖా అన్సారీ (రజి) నూనూగు మీసాల కుర్రవాడుగా ఉండగానే బద్ర్ యుద్ధ దినాన అమరగతి నొందారు. తరువాత ఆయన తల్లి (రబీ బిన్తె నఫర్, ఈమె అనస్‌కు మేనత్త కూడా) దైవప్రవక్త(స) సన్నిధిలోకి వచ్చి, 'యా రసూలల్లాహ్! హారిసాను నేను ఎంతగా ప్రేమిస్తానో మీకు తెలిసిందే. ఒకవేళ అతనిప్పుడు స్వర్గంలో ఉంటే, నేనతని వియోగంపై ఓర్పు వహిస్తాను. అల్లాహ్ నుండి పుణ్యాన్ని ఆశిస్తాను. కాని ఒకవేళ అతను మరోచోట ఉండే మాటైతే, నేను ఏ స్థితిలో ఉన్నానో మీరు చూస్తూనే ఉన్నార'ని విన్నవించుకుంది. దానికి దైవప్రవక్త(స), "అల్లాహ్ నీపై దయ జూపుగాక! నీకేమైనా పిచ్చిపట్టిందా? అక్కడ ఒకే స్వర్గవనం ఉందని అనుకుంటున్నావా? చాలా స్వర్గవనాలున్నాయి. కాగా, నీ కుమారుడు జన్నతుల్ ఫిర్దౌస్‌లో ఉన్నాడ"ని[1] అన్నారు.

**609)** హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) కథనం : బద్ర్ యుద్ధ సందర్భంగా నేను పంక్తిలో నిలబడి ఉన్నాను. నేను వెనక్కి తిరిగి చూడగానే నాకు కుడి వైపున, ఎడమ వైపున ఇద్దరు నవ యువకులు కనిపించారు. నేను వారి గురించి ఇంకా ఒక నిర్ధారణకు రాకముందే, వారిద్దరిలో ఒకబ్బాయి రహస్యంగా- రెండవ వానికి వినిపించకుండా- 'బాబాయి! నాకు అబూ జహ్లును చూపించండి' అన్నాడు. దానికి నేను, "అబ్బాయి! నువ్వు అతన్ని చూసి ఏం చేస్తావ్?"అనడిగాను. 'నాకు అతను కనిపించగానే నేనతన్ని హతమార్చడమైనా చేస్తాను లేదా నేను స్వయంగా చావనయినా చస్తాను అని అల్లాహ్ సమక్షంలో ప్రతిజ్ఞ చేశాను' అని ఆ అబ్బాయి చెప్పాడు. రెండవ అబ్బాయి కూడా తన తోటివానికి తెలియకుండా నాకు అదే విషయం అడిగాడు. ఆ క్షణంలో ఆ టీనేజీ కుర్రవాళ్ళ మధ్య నిలబడి ఉండటం నాకెంతో సంతోషం కలిగించింది. అదుగో, అతనే అబూ జహల్ అంటూ నేను వారికి సంజ్ఞ చేశాను. అతన్ని చూడగానే వారిద్దరూ గ్రద్దల మాదిరిగా అతనిపై పడి, అప్పటికప్పుడే కడతేర్చారు. వీరిద్దరూ అఫ్రా కొడుకులు.[1]

**612)** ముఆజ్ బిన్ రిఫాఅ బిన్ రాఫె జురఖీ తన తండ్రి రిఫాఅ బిన్ రాఫె నుండి ఉటంకించారు. ఆయన బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారు. ఆయన ఇలా వివరించారు: దైవదూత జిబ్రీల్(అలైహిస్సలామ్) ప్రవక్త మహనీయుల(సఅసమ్) సన్నిధికి వచ్చి, 'బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారి అంతస్తు గురించి మీరేమంటారు?' అని అడిగితే, "వారు ముస్లింలందరిలోకెల్లా శ్రేష్ఠులు" అని ఆయన (స) చెప్పారు. లేదా ఆయన(స) అలాంటి మాటే అన్నారు. దానికి జిబ్రీల్(అ), 'బద్ర్ యుద్ధంలో పాల్గొన్న దైవదూతల స్థాయి కూడా అటువంటిదే'[1] అని అన్నారు.

603-1. ఈ హదీసును బట్టి బద్ర్ యుద్ధంలో పాల్గొన్న యోధుల విశిష్టత తెలిసి వస్తోంది- వారంతా స్వర్గవాసులు. హారిసా తండ్రి సురాఖా కూడా హునైన్ యుద్ధంలో వీరమరణం పొందారు.

609-1. వీరిద్దరూ ముఆజ్ బిన్ అఫ్రా, మవూజ్ బిన్ అఫ్రా అనీ, వీరిద్దరి తల్లి పేరు అఫ్రా అనీ కొన్ని ఉల్లేఖనాలలోఉంది. వీరి తండ్రి పేరు హారిస్ బిన్ రిఫాఅ. దైవప్రవక్త (స)ను దూషించిన అబూజహ్లును వధించాలని ఈ కుర్రాళ్ళు ఇద్దరూ ముందు గానే ప్రతిజ్ఞ చేసుకున్నారు. అనుకున్నది సాధించారు. నూరు గొడ్లను తిన్న రాబందు ఒక్కగాలి వానకే కూలిపోయినట్లు సత్య తిరస్కారుల సర్దారు సాధారణ కుర్రాళ్ళ చేత వధించబడ్డాడు.

612-1. దైవదూతలు ఇతర యుద్ధాలలో కూడా దివి నుండి భువికి దిగి వచ్చిన సందర్భాలున్నాయి. కాని బద్ర్ మైదానంలో మాత్రం దైవదూతలు ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొన్నారు. బైహఖీలోని ఉల్లేఖనం ప్రకారం దైవదూతలు కొట్టిన దెబ్బ గుర్తు పట్టబడేది. మెడపైన వేసే దెబ్బ, పార్శ్వాలపై నిప్పు వాత వంటివి విలక్షణంగా భావించబడ్డాయి. ఇస్హాఖ్ సనదులో జుబైర్ బిన్ ముత్ఇమ్ కథనం ఇలా ఉంది: బద్ర్ యుద్ధం నాడు నేను అవిశ్వాసుల పరాజయానికి ముందు ఆకాశం నుండి నల్లని చీమలు దిగి రావటం చూశాను. వారే దైవదూతలు. వారు దిగగానే అవిశ్వాసులు ఓటమి పాలయ్యారు.

# దైవ మార్గబోధన- సంపూర్ణ నివారిణి-2

- ఎస్.ఎమ్.మలిక్

## మార్గబోధన

ప్రారంభంలో మనం గమనించాము, దివ్య కుర్‌ఆన్‌ని పరిచయం చేస్తూ దైవం దాన్ని మానవాళికి 'మార్గ బోధన' అని వక్కాణించటం జరిగింది. సాధారణతః మార్గబోధన అంటే, కూలంకషంగా ఒక విషయాన్ని, అర్థమయ్యేలా చెప్పడం. ఇంకా ఏదయినా కార్యాన్ని చేసే విధానాన్ని తెలుపడం, ఏదైనా సమస్యను పరిష్కరించే విధానాన్ని తెలుపడం. ఇంకా ముక్తసరిగా చెప్పాలంటే, అది సత్యజ్ఞానం, దాని ప్రకారం జీవించడం. ఇదీ మార్గబోధన అంటే. దివ్య కుర్‌ఆన్ ఈ భావాలన్నింటి ప్రకారం మార్గబోధన!

దివ్య కుర్‌ఆన్ అంటుంది :

**మేము వారికి ఒక గ్రంథాన్ని అందజేశాము, దాన్ని మేము జ్ఞానం ఆధారంగా సవివరమయినదిగా చేశాము. అది విశ్వసించేవారి కొరకు మార్గబోధన, కారుణ్యం. (7: 52)**

ఇంకా :

**మానవులారా! మీ కొరకు మీ ప్రభువు వద్ద నుంచి మహోపదేశం వచ్చేసింది. అది ఆంతర్యాలకు ఆరోగ్య ప్రదాయిని, దాన్ని విశ్వసించేవారి కొరకు మార్గబోధిని, కారుణ్యం కూడా. (10: 57)**

ఇంకా:

**...ఇకపై నా వద్ద నుంచి మీకు ఏదయినా మార్గబోధన అందినట్లయితే, ఎవరయితే ఆ మార్గబోధనను అనుసరిస్తాడో అతను రుజుమార్గాన్ని తప్పిపోడు, మరెటువంటి దౌర్భాగ్యానికి గురికాడు, మరెవరయితే నా ఈ సందేశానికి విముఖుడవుతాడో అతనికి నిశ్చయంగా ప్రపంచ జీవితం కుంచించుకుపోతుంది, ఇంకా పరలోకంలో అతన్ని గుడ్డివానిగా లేపుతాము. (20: 123,124)**

ఇంకా ఇదీ గమనించండి :

**ప్రవక్తా! గమనించగలవు, నీకు నీ ప్రభువు పక్షాన అవతరించిన దాన్ని, అది సంపూర్ణంగా సత్యమని, బలోపేతుడు, స్తవనీయుడయిన దైవం వైపునకు దారి చూపుతుందని జ్ఞానులు బాగా గ్రహిస్తారు. (34:6)**

పైనుదాహరించిన దివ్య కుర్‌ఆన్ వచనాల ద్వారా మనం సునాయాసంగా గ్రహించగల విషయాలు అతి స్పష్టంగా ఉన్నాయి. దివ్యకుర్‌ఆన్ దైవగ్రంథం అని, అది దైవం వద్ద నుండి ప్రవక్త ముహమ్మద్(స)కు అవతరించిందని, ఆయన దాన్ని మానవాళికి దైవ కృపగా, దైవ కారుణ్యంగా, సన్మార్గానికి, సత్య కాంతిలోకి గొనిపోయే మార్గబోధనగా అందజేశాడనీ తెలుపుతుంది. అదేవిధంగా ఈ వచనాల ద్వారా ఈ సందేశాన్ని స్వీకరించడానికి నిరాకరించే అజ్ఞాన జనం దీనికి భిన్నంగా దారి తప్పి చీకట్లల్లో తచ్చాడుతూ ఉంటారనీ తెలుస్తోంది.

ఇంకా ఈ గ్రంథం, మానవాళిని ఈ అజ్ఞానపు అంధకారం నుండి, మోసపూరిత అపమార్గాల నుండి, జ్ఞానకాంతిలోకి, రుజుమార్గానికి దారిచూపే గ్రంథమని బోధపడుతుంది- ఇంకా ఎవరయితే దైవమార్గాన లేరో వారు తప్పనిసరిగా అంధకార కుహరాలలోనే మగ్గుతున్నారని, వారు తమ్ముతాము ఎంతగా మహాజ్ఞానులుగా, మహా మేధావులుగా భావించినా సరే! అలాగే ఎవరయితే దైవ మార్గాన్ని గ్రహించి రుజుమార్గాన్ని అనుసరిస్తారో వారు జ్ఞానకాంతిని పొందినవారని, వారు నిరక్షరాసులయినా, అక్షర కుక్షులయినా సరే అనీ చాటుతోంది.

విశ్వజనీన సందేశం

**ప్రవక్తా! మేము నిన్ను వాస్తవానికి నిఖిల జగతికి మా కారుణ్యంగానే చేసి పంపాము (21: 107)**

ఇంకా :

**జనులారా! ఈ దైవ సందేశహరుడు మీ వద్దకు మీ ప్రభువు వద్ద నుండి సత్యాన్ని తీసుకువచ్చాడు. (ఈ సత్యాన్ని) విశ్వసించండి, మీకే శ్రేయస్కరం. మరి దీన్ని తృణీకరిస్తే, బాగా తెలుసుకోండి, భూమ్యాకాశాల్లో ఉన్న సర్వమూ దైవానికే చెందినది, మరాయన సర్వో పరిజ్ఞాని, వివేచనాపరుడున్నూ. (4: 170)**

మరో చోట ప్రవక్త నోట :

**ప్రవక్తా ప్రకటించు, మానవులారా! నేను, మీరు యావన్మంది వద్దకు, భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువయిన దైవం పంపిన సందేశహరుణ్ణి, ఆయన తప్ప మరే దైవమూ లేడు; ఆయనే జీవితాన్ని అనుగ్రహిస్తాడు, ఆయనే మృత్యువునూ ఇస్తాడు. కనుక ఆ దైవాన్నే విశ్వసించండి, ఆయన పంపిన నిరక్షరాసి అయిన సందేశహరుణ్ణి విశ్వసించండి. అతను దైవాన్నీ ఆయన బోధనల్నీ నమ్ముతాడు. అతన్ని అనుసరించండి, మీరు రుజుమార్గాన్ని పొందగలరన్న ఆశాభావముంది! (7: 158)**

ఓ చోట దేవుని మహోపకారాలు ప్రస్తావిస్తూ :

**జనులారా! (మీ జీవితాలలో) మీ ప్రభువు దాస్యాన్ని పాటించండి, ఆయన మిమ్మల్నీ, మీకు పూర్వం గతించినవారినీ సృజించిన వాడు, అప్పుడే మీరు రక్షించబడతారని ఆశించడానికి ఆస్కారముంటుంది. ఆయనే కదా మీ కొరకు భూమిని పాన్పుగా పరిచాడు, ఆకాశాన్ని కప్పుగా చేశాడు, పైనుండి నీటిని కురిపించాడు, తద్వారా సకల విధాల పంటలు పండించి మీ కొరకు జీవికను అందజేశాడు. కనుక మీకు ఇదంతా తెలిసి నప్పటికీ (దైవే)తరుల్ని అల్లాహ్‌కు సహవర్తులుగా ఎంచకండి. (2: 21,22)**

ఈ వచనాల ప్రస్ఫుటమయిన అతి స్పష్టమయిన భావం, ఈ అత్యంత వృద్ధ విశ్వం, సహస్రా శతాబ్దాల నుండి తానయి ఉనికిలోకి రాలేదు, తానయి స్వయంగా నిరంతరం కొనసాగుతూ ఎటువంటి పొరపాటు జరక్కుండా, విధాత నిర్ణయించిన విధి విధానాలను జవదాటనూ లేదు. అలా జరిగి ఉంటే అది ఎప్పుడో సర్వనాశనమయిపోయేది. దీనికి ఓ కర్త అంటూ ఉన్నాడు, ఆయన ఒక్కడే, ఆయనే నిరంతరం ఈ అనంతమయిన విశ్వ వ్యవస్థను చిన్న పొరపాటు కూడా జరక్కుండా నడుపుతూ ఉన్నాడు. ఈ సృష్టి యావత్తు కొనసాగడానికి ఆ శక్తి, ఆ పరమ శక్తివంతమయిన అధికార సత్తా గల అస్తిత్వం, నిరంతరాయంగా- 'కున్' (ఉనికిలోకి రా) అన్న ఆదేశ నినాదంతో ఈ వ్యవస్థను నడుపుతూ ఉంది.

మనిషి, సృష్టి అంతటిలో జ్ఞానమూ, వివేచన, క్రియా స్వేచ్ఛ గల సృష్టి, ఆ ప్రభువు 'మఆరిఫత్', 'ఎరుక' (Cognition)గల సృష్టి మానవుడు, ఆ జ్ఞాన సంపద ద్వారా సృష్టికర్త, పరమ శక్తిమంత మయిన ఆ అస్తిత్వం సమక్షంలో మోకరిల్లడం, ఆరాధనా భావంతో స్తుతించడం, ఆయన ఆదేశాలను పాలించడం తప్ప మరో మార్గముందా? లేదని ఘోషిస్తుంది దివ్యకుర్‌ఆన్. ఇదే పైనుదాహరించిన వచనాల భావసారం.

## న్యాయస్థాపన

కుర్‌ఆన్ ప్రకారం మానవునికి అప్పగించబడిన మహత్తర బాధ్యత, ప్రపంచంలో, మానవుల మధ్య న్యాయాన్ని, సంతులనాన్ని స్థాపించడం. అది నిజాయితీగా నీతిమంతంగా నెలకొల్పబడాలి. ఇదొక నైతిక ప్రమాణం, అందరికీ సమ్మతమయిన, అంగీకృత మయిన, ఆమోదయోగ్యమయిన, అనుమోద యోగ్యమయిన ప్రక్రియ.

**నీవు తీర్పు చేయవలసి వస్తే న్యాయబద్ధంగా తీర్పు చెయ్యి, దైవం న్యాయం చేసేవారినే ప్రేమిస్తాడు. (5: 42)**

మరో చోట మానవుల మధ్య సమానతను, సంతులనాన్నీ ప్రబోధిస్తూ ఇలా చెప్పడం జరిగింది :

**విశ్వసించిన వారలారా! నిబద్ధతతో న్యాయానికి ధ్వజవాహకులు అవండి, దైవం కొరకు సాక్షులవండి; మీరు చేసే న్యాయం లేదా మీ సాక్ష్యం దెబ్బ స్వయంగా మీపైనా, మీ తల్లిదండ్రుల పైన, మీ బంధుగణంపైన పడినా సరే- కక్షిదారులు శ్రీమంతులు, నిరుపేదలు, ఎవరయినాసరే- దైవం స్వయంగానే మీకన్నా అధికంగా వారి పట్ల శ్రేయోభిలాషి; కనుక మీ మనోకాంక్షల అనుసరణలో న్యాయానికి వెరువకండి. (4: 135)**

ఇస్లామీయ జీవన విధానంలో మానవ జీవితానికి సంబంధించిన ఏ కోణమూ, ఏ అంశమూ ఇస్లామ్ పరిధి నుండి వేరుగా ఉండ జాలదు. సామాజిక న్యాయం (Social Justice), ఆర్థిక న్యాయం (Economic Justice) కూడా దాని అంతర్భాగమే. కనీసావసరాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చూడటం పరిపాలనా వ్యవస్థపై ఉన్న కనీస బాధ్యత. ఆర్థిక న్యాయం ప్రకారం ప్రతి ఒక్కరికి, సంతులిత జీవిక మార్గాలు లభ్యమవ్వాలి. కొందరి చేతుల్లోనే సమాజంలో సంపద యావత్తు కేంద్రీకృతమవడం ఈ వ్యవస్థలో ఎంతమాత్రం సమర్థనీయం కాజాలదు.

**ఈ ప్రాంతాల వారి నుండి దైవప్రవక్త వద్దకు (ప్రభుత్వ వ్యవస్థకు) లభించేదంతా అది దైవం, దైవప్రవక్త (ప్రభుత్వ వ్యవస్థ)కు, ప్రవక్త సమీప బంధుగణానికి (కుటుంబీకులకు), అనాథలు, నిరుపేదలు, బాటసారులకు చెందినది. ఈ విధంగా అది కేవలం మీలోని శ్రీమంతులలోనే పరిభ్రమిస్తూ ఉండకుండా (లేమికి గురయిన) అందరికీ అందుబాటులో ఉంటుంది. (59: 7)**

## నైతిక ప్రాముఖ్యం

ఇస్లామ్ ఆధ్యాత్మిక ప్రధానమయిన జీవన వ్యవస్థ కావటాన, ఆ

వ్యవస్థలో సామంజస్యము, సంతులనమూ, సమగ్రత ఉండటం మూలాన దివ్య కుర్‌ఆన్ మానవుని నడత, అతని వ్యవహారశైలి, ప్రవర్తనా విధానాన్నీ సంబోధిస్తుంది. మానవులు తోటి మానవుల పట్ల అత్యుత్తమ రీతిలో వ్యవహరించాలని, సకల సద్గుణ శోభతో మెలగాలని కోరుకుంటుంది. నిజానికి మానవులంతా ఆ విధానాలను అలవరచుకున్నట్లయితే ఈ ప్రపంచం సకల సంపదలతో, శాంతి సుఖాలతో, శ్రేయోవ్యవస్థతో అలరార గలదు. అలాంటి ఓ ఆదర్శంగా దైవం తన చివరి ప్రవక్త పాత్రను ముందుంచుతాడు.

> **ఇంకా నిస్సందేహంగా నీవు ఓ ముహమ్మద్! అత్యున్నత నైతిక స్థానాన ఉన్నావు. (68: 4)**

ఇంకా, మరోచోట మానవుల్ని సంబోధించి ఇలా అంటుంది :

> **వాస్తవానికి మీ కొరకు దైవ సందేశహరునిలో ఓ ఉత్తమ ఆదర్శముంది. (33: 21)**

ఆయన తన జీవితంలో ఓ సామాన్య పౌరునిగా, తండ్రిగా, తనయునిగా, భర్తగా, తండ్రిగా, కుటుంబ పెద్దగా, ఉద్యమ నాయకునిగా, పాలకునిగా, సేనా నాయకునిగా- ప్రపంచంలో మానవులు నిర్వహించే సకల పాత్రలు అత్యుత్తమంగా నిర్వర్తించి ఓ ఉత్తమ ఆదర్శాన్ని నెలకొలిపారు. ఆ ఆదర్శాన్ని అనుసరించవలసిందని మానవాళికి బోధిస్తుంది కుర్‌ఆన్.

### సమీక్ష

గత పంక్తుల్లో గమనించినట్లు మానవాళికి అవసరమయిన మతం, ధర్మం, జీవన విధానం దానికి అవసరమయిన వ్యక్తిగత ఆదర్శం- ప్రవక్త ముహమ్మద్(స) వ్యక్తిగత, కుటుంబ జీవితంలోనూ ఆయన నెరపిన ఉద్యమం లోను, ఆయన నెలకొలిపిన సమాజంలోను, ఆయన స్థాపించిన సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలోనూ మనకు దర్శనమిస్తాయి. ఆయన అందజేసిన దైవ సందేశం, దివ్యకుర్‌ఆన్‌ని, ఆయన బోధనలు హదీసుల్ని, ఆయన చరిత్రను భద్రపరిచే బాధ్యత నిఖిల జగతికి ప్రభువు అయిన దైవం స్వయంగా తీసుకున్నాడు గనక అవన్నీ నేడు మనకు, అందరికీ అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా ప్రయోజనం పొందడమే నేటి ఆవశ్యకత.

## ఒక మంచి మాట

- అస్సలు తప్పు చేయనివారు దైవదూతలు.
- తప్పు చేసి, దానిపై పాతుకుపోయే వారు పైశాచిక స్వభావం కలవారు (షైతానులు).
- తప్పు జరిగిన మీదట వెంటనే పశ్చాత్తాప పడేవారు మానవీయ గుణం కలవారు.
- పశ్చాత్తాపం చెందిన మీదట, దానిపై స్థిరత్వం కలిగి ఉండేవారు దైవానికి ప్రియతములైన దాసులు.

– ఇమామ్ గజాలీ (రహ్మ)


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com



ముహమ్మద్ అజ్గర్ అలీ

# ఆజాద్ హింద్ ఫౌజ్ ముస్లిం మహిళా సైనికులు

**1857లో** జరిగిన మొదటి భారత స్వతంత్ర సంగ్రామంలో బ్రిటీష్ వారితో భారతీయ పురుషులతో పాటు హిందూ, ముస్లిం, సిక్కు మహిళలు కలసికట్టుగా పోరాడారు. ఝాన్సీ రాణి, బేగం హజ్రత్ మహల్ వంటి మహిళలు జరిపిన తిరుగుబాటు భారత దేశంలో బ్రిటిష్ సామ్రాజ్య పునాదిని కదిలించింది.

రెండవ ప్రపంచ యుద్ధం 1945 చివరలో ముగిసింది. ఇండియన్ నేషనల్ ఆర్మీ ఆజాద్ హింద్ ఫౌజ్‌కి చెందిన సైనికులను యుద్ధ ఖైదీలుగా బంధించి సైనిక న్యాయస్థానాల ముందు ప్రవేశపెట్టారు. ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికులపై జరిగిన విచారణల మీడియా కవరేజ్ ద్వారా భారతీయులకు సుభాస్ చంద్రబోస్ నేతృత్వంలోని INA ఎలాంటి పోరాటం చేసిందో తెలుస్తుంది. భారతదేశాన్ని స్వాధీనం చేసుకోవాలనుకునే జపనీయులు, జర్మన్ల ఏజెంట్లుగా INAను చాలా మంది విమర్శించారు కాని INA ఒక స్వతంత్ర భారత సాయుధ దళమని ఈ మీడియా కవరేజి ద్వారా స్పష్టమయ్యింది. అప్పట్లో INAకు భారతీయ ప్రవాసులు నిధులు సమకూర్చారు. INAలో హిందువులు, ముస్లింలు, సిక్కులు కలిసి పోరాడారు.

INAలో ఝాన్సీ కి రాణి అనే ఒక మహిళా రెజిమెంట్ ఉండేది. INAలోని మహిళా రెజిమెంట్ కు కెప్టెన్ లక్ష్మీ సహగల్ నాయకత్వం వహించారు.

INAలో చాలా మంది ప్రధాన జనరల్స్ ముస్లింలు వారితో బాటు కొంతమంది ముస్లిం మహిళలు ఝాన్సీ కి రాణి అనే మహిళా రెజిమెంట్‌లో ఉన్నారు. INA డిఫెన్స్ కమిటీ ప్రకారం "INAలోని ముస్లిం మహిళల్లో ప్రముఖుల్లో, ఎర్రకోటలో బంధీగా ఉన్న కెప్టెన్ సలీమ్ భార్య శ్రీమతి సలీమ్ సుల్తానా, థాయ్‌లాండ్‌లో ఉన్న భారతీయుల కోసం పనిచేస్తున్న మేజర్ వహాబ్ ఖాన్ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సుల్తానా భర్త కల్నల్ సలీమ్ INAలో పనిచేశారు. సుల్తానా ఝాన్సీ కి రాణి రెజిమెంట్‌కు చెందిన ప్రముఖ అధికారులలో ఒకరు. యుద్ధం ప్రారంభమయ్యే ముందు సుల్తానా బర్మా నివాసి. INA మహిళా రెజిమెంట్‌లోని మెజారిటీ సైనికుల మాదిరిగానే సుల్తానా కూడా ఎటువంటి ముందస్తు సైనిక శిక్షణ లేకుండానే సుభాస్ చంద్రబోస్ పిలుపుకు ప్రతిస్పందించింది.

యుద్ధ సమయంలో సుల్తానా మరో యువ INA అధికారి సలీమ్‌ను కలిశారు, సలీమ్ బ్రిటీష్ ఇంపీరియల్ ప్రభుత్వంలోని భారత సైన్యంలో పనిచేసిన తర్వాత INAలోకి వచ్చారు. బోస్ ఆశీస్సులతో INAలో ఈ ఇద్దరు అధికారులు వివాహం చేసుకున్నారు.

యుద్ధం ముగిసిన తర్వాత సలీమ్ యుద్ధఖైదీగా జైలు పాల య్యాడు. సుల్తానా ఫిబ్రవరి 1946లో ఝాన్సీ కి రాణి రెజిమెంట్‌కి చెందిన మొదటి సైనికుల బృందంలో భాగంగా భారతదేశానికి చేరుకుంది. సుల్తానా పత్రికలవారితో మాట్లాడుతూ INA గురించి, బోస్ నేతృత్వంలోని ఉద్యమం గురించి ప్రజలకు చెప్పింది.

సుల్తానా సలీమ్ భారతదేశంలో మహిళలకు సైనిక శిక్షణను సమర్థించారు. మహిళలు పురుషులతో సమానం అని, తప్పని సరిగా సైనిక శిక్షణ పొందాలని అన్నారు. సైనిక శిక్షణ దృఢంగా ఉండేందుకు సహాయపడిందని, జీవితంలోని ఇబ్బందులను ఎదుర్కునేలా తీర్చిదిద్దిందని తెలియజేశారామె. సైనిక శిక్షణ క్రమశిక్షణను నేర్పుతుంది. నిర్భీతినిస్తుందన్నారు. మహిళలు ముందుకు వస్తే పురుషుల్లో కూడా మరింత త్యాగనిరతి, పోరాట స్ఫూర్తి కలిగిస్తారని చెప్పారు.



# మరీ ఇంత దారుణమా?

**- షేఖ్ అబ్దుల్ బాసిత్, కొత్తగూడెం**

## ఏమైంది, బాబాయ్?

కలకత్తాలో జరిగిన దారుణం గురించి నువ్వు వినలేదా?

అవును బాబాయ్, దేశంలో రోజురోజుకీ బలహీనులపై ముఖ్యంగా ఆడవారి మీద అత్యాచారాలు పెరిగిపోతున్నాయి బాబాయ్.

దీనికి కారణాలు ఏంట్రా అబ్బాయ్?

హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలన్నింటికి ఒక్కటే కారణం భద్రం అన్న.

ఏంటిది తమ్ముడు?

ఇంకా ఏముందన్న, మద్యం.

అవును తమ్ముడు. మద్యం కన్నా ఇప్పుడు యువత డ్రగ్స్‌కు బానిసై పోతుంది.

ఈ మద్యం, మత్తు పదార్థాలను నిషేధిస్తే కానీ ఈ దారుణాలను అరికట్టడం సాధ్యం కాదు బాబాయ్.

అందుకే "సకల చెడులకు మూలం మద్యం" అన్నారు ప్రవక్త ముహమ్మద్(స).

అందుకే మత్తు కలిగించే ఏ పదార్థం దరిదాపుల్లో కూడా వెళ్ళ రాదంటుంది ఇస్లాం.

దేశంలో ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, సంఘ సేవకులు, ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహిస్తారు. నిందితులకు ఉరిశిక్ష వేయాలంటారు.

టి.వి.లలో డిబేట్లు, పెద్ద పెద్ద ఉపన్యాసాలు!

ఆ తర్వాత అంతా మరచిపోతారు.

మరో సంఘటన జరిగే దాకా నోరు మెదపరు.

నిజమే రా అబ్బాయ్!

అసలు రోగానికి మందు వేయకుండా, పై పై పూతలు పూస్తే లాభం ఏంటి?

అవును, బాబాయ్. ఈ సకల చెడులకు అసలు పరిష్కారం మత్తు పదార్థాల నిషేధం.

అంతే కాదు తమ్ముడు. నేటి సినిమాలు, పోర్న్ వీడియోలు, ఎంటర్టైన్మెంట్ పేరుతో వస్తున్న టి.వి. సీరియల్స్ కూడా ఇలా అత్యాచారాలకు ఆజ్యం పోస్తున్నాయి.

నిజం చెప్పావు అన్నయ్యా.

హహ్ హహ్, మీరు భలే పిచ్చోళ్ళు .

'ఎందుకు రా అలా నవ్వుతున్నావ్?

నవ్వక ఏం చేయమంటారు,

మన ప్రభుత్వాలు నడిచేదే వీటితో తెలుసా?

మౌలానా గారు, మీరేంటీ మౌనంగా నిలబడ్డారు.

ఏం మాట్లాడమంటావు భాయ్. మనిషి జీవిత మర్మాన్ని మరచి పోయాడు. మరణం తథ్యం అని, మరణం తర్వాత ఇక్కడ చేసిన ప్రతి పనికి సమాధానం చెప్పుకోవాలి  అన్న విషయాన్ని కూడా మరచిపోయాడు. ఫలితంగా రంగు రంగుల ప్రాపంచిక మాయలో పడి మంచి చెడుల విచక్షణ మరచి, సుఖ భోగాల మత్తులో మునిగి తేలుతున్నాడు.

నిజమే మౌలానా గారు. మనిషిలో నిజమైన దైవభీతి మరణా నంతర జవాబుదారీతనం ఉంటేనే ఎలాంటి చెడులు అయినా వాటంతటఅవే తగ్గిపోతాయి.

అవును మౌలానా గారు, సమాజంలో జరిగే చెడులన్నింటికి కారణం మీలాంటి ధార్మిక పండితులే అంట కదా?

భలే ఉన్నావే. అటు తిప్పి, ఇటు తిప్పి మా మీదే బట్ట కాల్చి వేస్తున్నావే.

మసీదులు, గుళ్ళు, గోపురాలు, చర్చీలు కుప్పలు తెప్పలుగా పెరిగిపోయాయి. అంతకు పదిరెట్లు చెడులు, సాటి వారిపై విద్వేషం పెరిగి పోయింది. ఇది నిజం కాదా?

నిజమే. కానీ దానికి మాలాంటి ధార్మిక పండితులు కారణం ఎలా అవుతారు?

ఎందుకు కారు. ''ధర్మోః రక్షతి రక్షితః'' అంటారు కదా.

మీరు ఏనాడైనా సమాజంలో జరిగే అనర్థాలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేయమని చెప్పారా?

ముఖ్యంగా ఇస్లాంలో చెడును నిర్మూలించాలి. మంచిని వ్యాపింప చేయాలి అన్న ఆదేశం ఉందా?

ఆ - ఉంది.

''చెడు జరుగుతుంటే చేతితో ఆపండి. లేదా నోటితో చెప్పండి. లేదా ఆ చెడు మీరు కూడా చేసినట్లే'' అని ప్రవక్త ముహమ్మద్ (స) తెలిపారా ?

అవును తెలిపారు.

ఇప్పుడు చెప్పండి, ఏనాడైనా మీరు కానీ మీ మస్జిదుకు, మందిరానికి చర్చికి వచ్చే భక్తులతో చెడు మీద సమరం చేయండి లేదా రేపు ఈ చెడుల ఊబిలో చిక్కుకుని విలవిలలాడుతారు అని చెప్పి ఉంటే ఈ రోజు సమాజం ఇలా ఉండేది కాదు కదా.

నిజం చెప్పావురా అబ్బాయ్. ప్రతి ఒక్కరూ నాకెందుకు, నేను మంచి వాడినే, మేము నిజమైన దైవదాసులం, దైవ స్తోత్రం చేస్తే చాలు అనుకోవడం వల్ల రోజు రోజుకు దారుణాలు మితిమీరి పోతున్నాయి. ఇందులో ఎందరో మన పిల్లలు బలి అయి పోతున్నారు.

భక్తి అంటే నమాజ్, భజన, కీర్తనలు కాదు.

భక్తి అంటే ఎలాంటి చెడులకు ఆస్కారం లేని సమాజం.

అవునురా అబ్బాయ్, రేపటి నుంచి ముందుగానే మద్యంపై పోరు సాగిద్దాం. యువతకు మంచి మార్గం వైపు మలచడానికి ప్రయత్నం చేద్దాం.

ప్రార్థన కోసం కాస్తోకూస్తో మంచివారే వస్తారు.

మీ ఈ ప్రయత్నం మసీదు, మందిరం, చర్చి బయట జరగాలి.

అవును భద్రం భాయ్. మీరు చెప్పింది నిజమే.

మనమంతా కలిసి చెడు మీద పోరాటం చేయాలి.

''చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు'' మన ప్రయత్నం ఉండకూడదు.

ఈ క్యాండిల్స్ ర్యాలీ, నిందితులకు ఉరిశిక్ష వేయాలి అనే నినాదాల కన్నా నిందితులుగా మారకుండా ఉండే వాతావరణం కోసం కృషి చేయాలి. పబ్బులు, క్లబ్బులు, డ్రగ్స్, మద్యం, అశ్లీల చిత్రాలు లేకుండా చేయాలి.

ప్రభుత్వాలు కూడా ఆదాయం కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం ఇలాంటి వాటిని నిషేధించే ప్రయత్నం చేయాలి. ❖


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**




# కట్నమన్నదే కంఠపాశమై...

**మానవులందరికీ** శుభం చేకూర్చగల శక్తి ఇస్లాం ధర్మానికి మాత్రమే ఉంది గనుక దీన్ని మానవ ధర్మం అన్నారు. శాశ్వత సిద్ధాంతాల మీద ఆధారపడి ఉంది గనుక దీన్ని సత్య స్థిర ధర్మం అన్నారు. జీవ కోటిలో అనాదిగా ఉన్న విధేయతా విధానమే ఇస్లాం కాబట్టి దీన్ని అల్లాహ్ ధర్మమని, ఒక లక్ష 24 వేల మంది ప్రవక్తలు ఎంతో నిష్టగా పాటించిన జీవం సంవిధానమే ఇస్లాం గనక దీన్ని ప్రవక్తల ధర్మమని అన్నారు.

మూఢాచారాలు, అన్యాయాలతో కూడిన ఆచారాలను ఇస్లామ్ సమూలంగా తుడిచి పెట్టదలచింది. తల్లిదండ్రుల ఆస్తిలో కుమార్తెలకు వాటా ఇవ్వకపోవడం, వితంతువును అత్తవారి ఇంట ఆంక్షలతో అణచిపెట్టడం, గడువు తీరినా స్త్రీకి రెండవ పెళ్ళికి స్వేఛ్ఛనివ్వకపోవడం, ముట్టయిన స్త్రీని అంటరానిదిగా చేసి ఆమెపై అనేక ఆంక్షలు విధించడం, సవతి తల్లిని పెండ్లాడటం, ఏకకాలంలో ఇద్దరు అక్కాచెల్లెళ్ళను వివాహ బంధంలో ఉంచడం, ధన వికేంద్రీకరణను నిరోధించే దత్త స్వీకార విధానం. పెంపుడు కొడుకును కన్నకొడుకుగా పరిగణించి రక్త సంబంధాలు ఏర్పరచడం మొదలైన దురాచారాలను ఇస్లాం నిర్మూలించ పూనుకుంది.

వరకట్నం- మత, కుల, వర్గ సమస్య కానేకాదు. ఇది భారత సమాజపు ఉమ్మడి సమస్య. వీరు వారు అన్న తేడా లేకుండా అందరి ఆడకూతుళ్ళు అనుభవిస్తున్న అంతులేని బాధ, వ్యధ, వధ. భారత దేశపు ఎనిమిది హిందూ వివాహ పద్ధతులలోనూ వరునికి ధనమిచ్చే ప్రసక్తి లేనేలేదు. భారత ప్రాచీన కావ్యాలలో కూడా కన్యాశుల్కం అన్న మాట వినబడుతుంది కానీ వరకట్నం అన్నమాట లేదు. మరి నేడు అటు నాస్తికుల్లోనూ, ఆస్తికుల్లోనూ సమానంగా కోరలు చాచుతున్న వరకట్న రక్కసి జడలు విప్పి జూలు విదిలిస్తుంది.

కొన్ని సామాజిక రుగ్మతలు జనంలో నరనరాన జీర్ణించుకు పోతాయి. అలాంటిదే వరకట్న దురాచారం.

వరకట్నం.. ఒక జాఢ్యం, వరకట్నం... ఒక సమస్య, వరకట్నం.. ఒక సామాజిక దోషం, వరకట్నం.. ఒక మూఢత్వం, వరకట్నం.. ఒక అనాగరికం.

అమ్మాయి కుందనపు బొమ్మైనా! సుగుణవతియైనా! విద్యావంతురాలైనా! ఉద్యోగస్తురాలైనా! ఒకింటిదాన్ని చేయాలంటే! వరకట్నం ఇచ్చుకోవాల్సిందే! అప్పో సప్పో చేయాల్సిందే! అస్థిపాస్తులైనా అమ్మాల్సిందే! స్త్రీకి శత్రువు స్త్రీ యే అన్న నానుడి అక్షరాల నిజం చేస్తున్నారు అత్త గారు- సంతలో పశువులా అబ్బాయి గారు- అంతులేని ఆశల త్రాచు ఆడపడుచు- ఒక్క మాటలో చెప్పాలంటే, కట్నం ఒక ఆచారం- నాడు సదుద్దేశ్యంతో ఏర్పరచారు! కట్నం- ఒక దురాచారం- నేడు దురుద్దేశ్యంతో పీడిస్తున్నారు!

మొన్న స్వయం వరం/ నిన్న కన్యాశుల్కం/ నేడు వరకట్నం/ పేరేదైతేనేమి బలయ్యేది వధువే కదా!

ప్రవక్త (స) కాలంలో వివాహం ఎంతో సులభంగా ఉండేది.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) దుస్తులపై పసుపు పచ్చని రంగును చూచి "ఇదేమిటీ?" అని అడిగారు. "ఓ దైవప్రవక్తా (స)! నేను ఒక స్త్రీకి ఖర్జూరపు విత్తనమంత బంగారాన్ని మహర్ ఇచ్చి వివాహమాడాను" అని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) చెప్పారు. దానికాయన(స) "అల్లాహ్ నీకు శుభమొసగుగాక! ఒక మేకనయినా సరే కోసి వలీమా విందు తప్పకుండా చెయ్యి"అని అన్నారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి)

అంటే, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) గారు వివాహం చేసుకున్నా రన్న విషయం అదే పట్టణంలో ఉన్న- అది కూడా ముస్లింల అధినాయకులు, దైవ ప్రవక్త అయిన ముహమ్మద్ (స) వారికే తెలియదు అంటే ఆ వివాహం ఎంత సహజంగా, సాదా సీదాగా జరిగి ఉంటుందో ఆలోచించండి! పైగా ఆయన (స) నన్నెందుకు పిలవలేదు, నాకెందుకు తెలుపలేదు అన్న ప్రశ్న కూడా వేయలేదు. వధూవరులిద్దరూ చల్లగా ఉండాలని దుఆ చేసి, ఆ సంతోషాన్ని పది మందితో పంచుకోవాల్సిందిగా సలహా ఇచ్చారు. ఇకపోతే వలీమా విందును వరుడు తన శక్తి స్థోమతలకు తగ్గట్టుగా ఇవ్వవచ్చు. అయితే దుబారా ఖర్చు చేయకూడదు. దైవప్రవక్త(స) ఏర్పాటు చేసిన కొన్ని వలీమా విందుల్లో ఒక మేక కన్నా తక్కువ మాంసం ఉండేది. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఆర్థిక స్థోమత దృష్ట్యా ఒక మేక కోయటం తక్కువ ఖర్చు క్రిందికే వస్తుంది.

పుణ్యతరాలు గడిచిపోయాయి- ముస్లింలు ఇస్లామీయ పద్ధతిలోనే వివాహాలను కొనసాగించారు. ప్రపంచంలో ఇన్ని మార్పులు వచ్చినా నేటికీ అరబ్బుల్లో వివాహ సమయంలో అమ్మాయిలు ఏమీ ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉండదు.

కానీ ఇస్లాం భారత ఉపఖండంలోకి వచ్చినప్పుడు, చాలా మంది భారతీయులు ఇస్లాం ప్రబోధించే ఉత్తమ నైతిక విలువలు, స్వచ్ఛమైన తౌహీద్ భావనకు ప్రభావితులై ఇస్లాం స్వీకరించారు. కాని వారు ఇస్లాంలో సరిగ్గా శిక్షణ పొందలేకపోయారు, దాని కారణంగా వారు జీవితంలోని ఇస్లామేతర ఆచారాలకు, అలవాట్లకు స్థానం కల్పించారు. ముస్లిం విశ్వాసాలు, ఆరాధనలు, వ్యవహారాలు, ముస్లిం సమాజం తీరుతెన్నులు, ఆర్థిక వ్యవస్థ- అన్నీ అన్య ప్రచారాలకు గురి అయ్యాయి. జీవితం లోని ఇతర రంగాలలో వలె వివాహం వేడుకల్లో వరకట్నం వంటివి చోటు చేసుకున్నాయి. ఫలితంగా ఈ రోజు, వివాహం ఒక ఆశీర్వాదం, దీవెనగా కాకుండా, ఒక భారంగా, శాపంగా మారింది. ఇది ముమ్మాటికీ అజ్ఞానపు ఆటవిక చేష్ట.

## బరువుల్ని దించే ధర్మం ఇస్లాం

ఆయన మంచి పనులు చేయమని (ప్రజలను) ఆదేశిస్తాడు. చెడుల నుండి వారిస్తాడు. వారి కోసం పరిశుద్ధ వస్తువుల్ని ధర్మసమ్మతం చేస్తాడు. అశుద్ధ వస్తువుల్ని నిషేధిస్తాడు. వారి మీద పడిన (ఆంక్షల) భారం తొలగిస్తాడు. వారు చిక్కు కున్న (దురాచార) బంధనాల నుండి వారికి విముక్తి కలిగిస్తాడు. కనుక ఎవరు అతడ్ని విశ్వసించి సమర్థించి అతనితో సహకరిస్తూ, అతనిపై అవతరించిన (ఖుర్ఆన్) జ్యోతిని అనుసరిస్తారో వారే సార్థకజీవులు. వారినే విజయం వరిస్తుంది. (అల్-ఆరాఫ్: 157)

## వరకట్న దురాచారం ఎలా మొదలయింది?

మరి ఈ వరకట్నం మన సంఘంలో ఎప్పుడు ఎలా ప్రవేశించింది? అరబ్బుల దండయాత్ర తరువాత అనీ, పాశ్చాత్య పద్ధతి అనీ కొందరు అంటారు. కానీ ఇస్లాంలో వరుడు కన్యకు మెహర్ అనే పేరుతో ధనాన్ని ఇవ్వడం ఉంది కానీ వరకట్నం లేదు. పాశ్చాత్య దేశాలలోనూ డౌరీ లేదు. అసలు మన దేశంలోనూ, ఇతరత్రా ఎక్కడా లేని ఈ ఆచారం ఎప్పుడు, ఎలా ఉద్భవించింది, ఎలా వేళ్ళూనుకుంది, ఎలా మర్రిచెట్టులా దశదిశలా వ్యాపించింది?

మనకు స్వతంత్రం వచ్చిన కొత్తలో చాలా మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగం అంటే రిటైర్ అయ్యే వరకు ఉద్యోగం, ఆ తర్వాత పెన్షన్ వస్తుంది. అంటే ఇలాంటి ఉద్యోగికి తమ అమ్మాయి నిచ్చి పెళ్ళి చేస్తే ఇంక ఆ అమ్మాయి జీవితం గురించి తల్లి దండ్రులకు బెంగ ఉండదు గదా. అప్పటి వరకు యువకులు ఏదో వ్యవసాయం లేదా వ్యాపారం చేసుకొని బతికేవారు. ఇలాంటి వారికి ఆదాయం నికరంగా ఉండదు. పైగా చెడు సహవాసం, చెడు అలవాట్లు ఉండొచ్చు. ఉమ్మడి కుటుంబాల్లో ఉంటారు. ఇలాంటి వారికి పిల్లనిస్తే చాలా అవస్థ పడుతుంది కదా. అందువలన వెదకి, వెదకి ప్రభుత్వ ఉద్యోగులకే ఎక్కువ మంది తమ అమ్మాయి నిచ్చి పెళ్లి చేసేవారు. ఇలా వరులకు ప్రాధాన్యత పెరిగింది. అలాంటప్పుడు ఒకేసారి నలుగురు లేక అయిదుగురు ఆడ పిల్లల తండ్రులు ఒకే వరుని కోసం పోటీ పడేవారు. అప్పుడు సహజంగా అమ్మాయిల తల్లిదండ్రులు మొహమాట పెట్టి అమ్మాయికి ఇంత ఆస్తి లేక కట్నం ఇస్తామని ముందుకు వచ్చేవారు. ఇలా వర కట్నం మొదలైంది. ఇలా కొన్ని వర్గాల్లో లేదా పరిస్థితుల్లో మొదలై చివరకు అదొక ఆచారం లేక దురాచారం అయిపోయింది. ఇప్పుడు సమాజం అంతా వ్యాపించింది.

## వరకట్నం సమాజానికి శాపంగా ఎలా మారింది?

**1) సున్నత్‌ను సమాధి చేస్తున్నారు:** సత్య ప్రవక్త సత్సంప్రదాయాన్ని సమాధి చేసి- అమానవీయ అపనమ్మకాలు, అపచారాలను, రాక్షస రీతి రివాజులను, వికృత వివాహ విధానాలను జీవం

పోస్తున్నారు. దైవప్రవక్త (స) ఇలా అన్నారు: నా సంప్రదాయాన్ని కాదని, నా ఆజ్ఞకు శిరసావహించని వ్యక్తి- అతను అపకీర్తిని, అవమానాన్ని మూట గట్టుకుంటాడు. (ముస్నద్ అహ్మద్)

**2) సత్కార్యానికి ప్రతి సత్కార్యం సంస్కారం :** సత్కార్యానికి ప్రతిఫలం సత్కార్యం తప్ప మరేమవుతుంది? (అర్-రహ్మాన్:60)

మేలుకు ప్రతిగా మేలే చేయాలి. ఇదే కదా న్యాయం. మరి అమ్మానాన్నలు- ఆడకూతురిని అపురూపంగా పెంచి నట్టింట నడిచే అపరంజికి 18- 20 సంవత్సరాలు కంటికి రెప్పలా కాపాడి పెళ్లి చేస్తున్నారే. మరి మనం వారికిచ్చే గౌరవం ఏమిటి? వారు చేసిన మేలుకు తిరిగి మనం మేలు చేయడం పోయి- ఇంత అనాగరికంగా, అమానుషంగా వ్యహరిస్తున్నామే- నిజంగా మనం మనసున్న మనుషులమేనా, లేదా మనసు చచ్చిన మర మనుషులమా? అయినా ఆడపిల్ల కదా - సుఖంగా ఉంటుందిలే అన్న గంపెడాశతో చాలామంది తల్లిదండ్రులు -గొడ్డు గోద అమ్ముకొని ఆస్తి పాస్తులు తాకట్టెట్టి, అప్పు సొప్పులు జేసి కట్న కానుకలిచ్చి పెండ్లి జేస్తరు. కోటి ఆశల పల్లకిలో సాగనంపుతారు. కానీ కాళ్ళ పారాణి, చేతులకద్దిన మెహందీ ఆరక ముందే కాటికి చేరుకుంటున్నాయి. అసలుకే మనం బంధువులమా? రాబంధువులమా? 'నీ రొట్టెను నువ్వు తింటే అది ప్రకృతి, నీ రొట్టె పక్కవాడికి పెడితే... అది సంస్కృతి, పక్క వాడిది లాక్కొని తింటే వికృతి. ఈ నీతి దృష్ట్యా మనం నీతిగున్నట్టా? నీతి తప్పినట్టా? మనకు కనీస సంస్కారం ఉన్నట్టా? లేనట్టా?

**3) కట్నం కావాలనడం పౌరుషానికి విరుద్ధం :** అల్లాహ్ స్త్రీలపై పురుషులకు కొంత ఆధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపదను స్త్రీల కోసం ఖర్చుపెడ్తున్నందు వల్ల పురుషులు స్త్రీలపై వ్యవహార కర్తలు అవుతారు. (నిసా: 34)

ఈ ఆయతు దృష్ట్యా మనం వ్యవహార కర్తలమా? ఉబుసుపోక వ్యక్తులమా? కాలాన్ని బట్టి రంగులు మారే ఊసరవెల్లులమా? ఆత్మసమీక్ష చేసుకోవాలి.

**4) ఒకరి సొమ్మును వారి అనుమతి, ఇష్టం లేకుండా తీసుకోకూడదు:** ఏ ఆడపిల్ల తండ్రైనా డిమాండ్ చేయబడిన కట్నాన్ని సంతోషంగా, మనస్ఫూర్తిగా ఇవ్వడు. దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: మీలోని ఏ ఒక్క వ్యక్తి సొమ్మును అతను స్వయంగా మనస్ఫూర్తిగా ఇస్తేగానీ తీసుకోవడం ఎవరికీ ధర్మసమ్మతం కాదు. (సహీహ్ అల్ జామే)

ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: మీరు ఒకరి ధనాన్ని మరొకరు అక్రమంగా కబళించకండి. (అల్-బఖరహ్: 188) ఈ ఆయతు దృష్ట్యా- మనం సక్రమార్కులమా, అక్రమార్కులమా, విక్రమార్కు లమా? మనకు మనమే ఆత్మ విమర్శ చేసుకోవాలి.

**5) కట్నం తీసుకోవడం నరకానికి తీసుకెళుతుంది :** హజ్రత్ జాబిర్ (ర) కథనం: ప్రవక్త (స) ప్రవచనం, "అధర్మ సంపాదన ద్వారా పోషించబడిన శరీరం స్వర్గంలో ప్రవేశించదు. అధర్మ సంపాదన ద్వారా పోషించబడిన శరీరం నరకంలో వెళ్ళటానికే తగినది." (అహ్మద్, తిర్మిజి, బైహఖీ-షు'అబిల్ ఈమాన్)

**6) కట్నం ఒక లంచం :** "లంచం ఇచ్చేవారు, లంచం పుచ్చుకునే వారిపై నుండి 'అల్లాహ్ కరుణ తొలిగి పోవుగాక' అని, 'అల్లాహ్ తిరస్కారం కలుగుగాక అని' రసూలుల్లా సల్లల్లాహు అలైహి వసల్లం శపించారు". (ముస్నద్ అహ్మద్)

ఆడబిడ్డ అమ్మానాన్నలు వేరే దారి లేక కట్నం ఇవ్వడానికి సిద్ధమవు తుండవచ్చు కానీ, వరునికి కట్నం తీసుకునే గత్యంతరం పరిస్థితి అయితే ఉండదు అయినా డిమాండ్ చేసో, ద్వంద వైఖరిని అవలంబించో కట్నం తీసుకుంటారు. అలా వారు అన్యాయంగా, అనైతికంగా సంపాదించటానికి ప్రయత్నిస్తున్నారు. ఇతరుల సంపదను హరాం (నిషిద్ధమైన) పద్ధతిలో స్వంతం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు.

**7) కట్నం తీసుకోవడం అంటే కొత్త పద్ధతిలో భిక్షమెత్తుకోవడమే:** అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్(స) హజ్రత్ ఖుబైసాతో ఇలా అన్నారు: "ఓ ఖుబైసా, (గుర్తుంచుకో) ధన సహాయం - అడగడం ముగ్గురికి మాత్రమే అనుమతించబడుతుంది." 1) చెల్లించలేని, లేమిలో ఉన్న అప్పున్న వ్యక్తికి- రుణం తీరే మేరకు అడిగే అనుమతి ఉంది. ఆపై అడగకూడదు. 2) ఆకస్మిక విపత్తు కారణంగా ఆస్తి ధ్వంసమైన వ్యక్తికి అడిగే అనుమతి ఉంది. కాబట్టి అలాంటి వ్యక్తిని అతని ఆహారం, వస్త్రాల అవసరం మేరకు లేదా తన వ్యాపారాన్ని మెరుగుపరుచుకునేంత వరకు అడగడానికి అనుమతించబడింది. 3) కూటికి కూడా గడవని కటిక పేదరికంతో బాధపడుతున్న వ్యక్తికి కూడా అడిగే అనుమతి ఉంటుంది. అయితే ఇది అతనికి తెలిసిన ముగ్గురు వ్యక్తులచే ధృవీకరించబడి ఉండాలి. (కాబట్టి) అతని ఆహారం, బట్టల అవసరం మేరకు లేదా అతను తన జీవితాన్ని నిర్వహించగలిగేంత మేరకు అడగడానికి అనుమతి ఉంది. "ఓ ఖుబైసా, (గుర్తుంచుకో) ఈ ముగ్గురిని తప్ప ఎవరికీ ధన సహాయం కోరే అనుమతి లేదు. ఈ మూడు సందర్భాలలో తప్ప ఒక వ్యక్తి ఏదైనా అడిగితే - అది అతనికి నిషేధించ బడుతుంది. అతని ఈ చేష్ట ఆటను నిషేధించబడిన హరామ్ సంపదను తిన్నట్లే. (ముస్లిం)

నేడు కట్నం అడిగే మర్యాద పద్ధతి ఏమిటంటే, మేము వరకట్నాన్ని హరామ్‌గా పరిగణిస్తున్నాం. మాకేమీ అవసరం లేదు. మీ అమ్మాయికి మీరు ఇవ్వాల్సింది ఎలాగో ఇస్తారు, నగలు గట్రా ఏం ఇస్తున్నారో వివరాలు చెప్పండి చాలు అంటారు. ఇంకొందరైతే - మేము వరకట్నాన్ని సాంఘిక నేరంగా భావిస్తాము.. నయా పైసా మాకవసరం లేదు. అయితే మా పెద్ద కోడలు,

లేదా మా పక్కింటి వారి కోడలు - ఇంట బంగారం, వంట సామానులు, బైకు, కారు తీసుకొచ్చింది. అవన్నీ మాకేం అవసరం లేదు అంటారు.

కొందరైతే భూములు, ఇళ్ల స్థలాలు, ఫ్లాట్లు కట్నంగా తీసుకుంటారు. వారు అల్లాహ్‌కు భయపడాలి. దైవ ప్రవక్త (స) ఏమన్నారో కాస్త ఆలోచించాలి:

“ఏ వ్యక్తి ఒక జానెడు భూమిని అన్యాయంగా ఆక్రమించుకుంటాడో, అదే చోట మొత్తం ఏడు భూములను క్రింది వరకు త్రవ్వాలని అల్లాహ్ అతనికి శిక్షిస్తాడు. మళ్ళీ అల్లాహ్ ప్రజల మధ్య తీర్పు పూర్తి చేసేంత వరకు ఆ ఏడు భూములు అతని మెడలో గుదిబండగా వేయబడుతాయి”. (తబ్రాని ఫిల్ కబీర్: 22/270. సరీహుల్ జామి: 2719.).

**8) దుబారా ఖర్చుకు దూరంగా :** వరకట్నం ఇవ్వడం వల్ల దుబారాగా, వృధాగా ఖర్చు చేయవలసి వస్తుంది. దుబారా, వృధా ఖర్చులను మన షరీఅత్ దుర్మార్గంగా పేర్కొంది. దుబారా ఖర్చు చేయకండి. దుబారా ఖర్చు చేసేవారు షైతాన్ సోదరులుగా పరిగణించబడతారు. షైతాన్ తన ప్రభువుకు కృతఘ్నుడై పోయాడు. (బనీ ఇస్రాయీల్: 26-27)

**9) కట్నం ఇచ్చి గొప్పలు పోవడం :** ఎవరి స్వార్థం వారిది. ఒక అబ్బాయి బాగా నచ్చితే ఎక్కువ మంది అమ్మాయిల తల్లిదండ్రులు అతని వెంట పడతారు. అప్పుడు మిగిలిన వారికి దక్కకుండా ఉండేందుకు ఈ “కట్నము” అనే దానిని ఉపయోగిస్తారు. అలాగే, మేము ఇంత ఇచ్చి మా అమ్మాయి పెళ్లి చేశాము అని గొప్పలు చెప్పుకోవడానికి కొందరు ఇష్టపడుతుంటారు. ఇస్లాం ధర్మంలో గర్వ ప్రదర్శన, ప్రదర్శనాబుద్ధి నిషిద్ధం.

గమనిక : ఈ పెళ్ళి అనే మార్కెట్‌లో అమ్మాయి, అబ్బాయి కూడా ఒక “సరుకు”తో సమానం. ఇప్పుడు అబ్బాయికి అన్ని యోగ్యతలు ఉన్నా రైతులు, పురోహితులు, చిన్న వ్యాపారులు, ఉమ్మడి కుటుంబములో ఉండే వరులకు పెళ్ళిళ్ళు కావడం లేదు. కాబట్టి -

ప్రభుత్వ ఉద్యోగాలు, అమెరికా ఉద్యోగులనే కాకుండా మంచి వాడు, గుణవంతుడు అయిన అబ్బాయిలను కూడా ఆడ పిల్లలు ఇష్టపడాలి. ఇది నాణేనికి రెండవ వైపు ఉన్న అంశం. మగ పిల్లలు ఎలా అయితే కట్నం కోసం ఆశ పడకూడదో, ఆడవాళ్ళు ఇలా లేని పోని గొప్పలకు పోయి జీవితాన్ని నాశనం చేసుకోకూడదు.

**10) పేదరికంలో వరకట్నం వేధింపులకు కారణమవుతుంది :** తండ్రులు లేదా సోదరులు తమ కుమార్తెలు లేదా సోదరీమణుల పెళ్లి చేయడానికి, వారి జీవితాలను పణంగా పెట్టి, వారి పొట్టలు కాల్చుకుని, అప్పు చేసి - ఆ తర్వాత తీర్చలేక అల్లాడుతున్నారు. అలాంటి వారి బాధ, వ్యధ వర్ణించలేనిది.

ఎప్పుడైతే బలవంతంగా రకరకాల మారు పేర్లతో వసూలు చేస్తారో లేదా పెళ్ళైన తరువాత అదనపు కట్న కానుకల కోసం హింసిస్తారో అది హేయమైనది. శిక్షార్హము కూడా. చాలా మంది తల్లిదండ్రులు- కట్న కానుకలు ఇచ్చే స్థోమత లేక ఎక్కడెక్కడో వెళ్లి చేయి చాచే దుస్థితి నేడు ఉంది. దానికి కారణం - మనం చూపని మానవత్వమే. మనం అందించలేని ఆ స్నేహహస్తమే. ఇలా చేసిన కుటుంబాల తర్వాతి తరాలు సర్వనాశనం అవుతాయి. అయ్యాయి. ఒకరి ఉసురు పోసుకున్నవారు బాగు పడినట్లు చరిత్రలో లేదు. వారు బాధితులు- వారి బాధకు అల్లాహ్‌కు మధ్య ఎలాంటి అడ్డుగోడ ఉండదు అన్న విషయాన్ని గ్రహించాలి.

**11) భ్రూణ హత్యలకు కారణం కట్నం :** కడుపులో ఎదుగుతున్న ఆడబిడ్డను పిండ దశలోనే చిదిమేస్తున్నారు. బాహ్య ప్రపంచానికి రాకముందే భ్రూణ హత్య చేస్తున్నారు. కడుపులోని ఆడ నలుసును నలిపేస్తుండటం వెనక కారణాలెన్నో! మన దేశంలో పుట్టిన బిడ్డను పెంచే స్థోమత లేని నిరుపేద కుటుంబాలు నేటికీ చాలానే ఉన్నాయి. ఆడపిల్లను పెంచి, మగపిల్లలతో సమానంగా చదివించి నప్పటికీ, పెళ్ళి సమయంలో వరుడికి కట్నకానుకలు సమర్పించుకోవాల్సి వస్తోంది. వరకట్న దురాచారాన్ని రద్దు చేయడానికి ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలేవీ క్షేత్రస్థాయిలో సరిగ్గా అమలు కావడంలేదు. పుట్టబోయే బిడ్డ ఆడా, మగా అని తెలుసుకోవడానికి పరీక్షలు చేయిస్తున్నారు. ఆడ శిశువు పుడుతుందని తెలిసి కొందరు గర్భస్రావం చేయించుకుంటున్నారు. మరికొందరు పుట్టిన బిడ్డను గుట్టుగా విడిచిపెడుతున్నారు. ఇందుకు వారు చెప్పే ప్రధాన కారణం- ఆడబిడ్డను సాకలేము పంపడానికి కట్నం తీసుకురాలేమన్నదే!

**12) పెళ్లి కాని ఆడపిల్లల్లో మానసిక రుగ్మతలు :** పెళ్లికాని అమ్మాయిలలో మానసిక రుగ్మతలు సర్వసాధారణం, డిప్రెషన్ పెరుగుతోంది. హిస్టీరియా మహమ్మారి పట్టి పీడిస్తోంది. యవ్వనం కొవ్వొత్తిలా కరిగిపోతుంది. కానీ ఇవన్నీ గొప్పోళ్ళకు ఏమీ పట్టదు.

**13) ముస్లిం బాలికల మతభ్రష్టత్వానికి ప్రధాన కారణం:** వరకట్న శాపం. కట్నం చెల్లించలేని కారణంగా అమ్మాయిల పెళ్లిళ్లు

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

జరగడం లేదు. ఫలితంగా కొందరు అన్య మతస్తులతో పారిపోయి పెళ్లి చేసుకుంటూ ఉంటె, కొందరు వేరే మార్గం లేక కూడా ఇలా చేస్తున్నారు. దీనికి బాధ్యులు ఎవరు?

14) కొన్ని ప్రాంతాల్లో అమ్మాయిలకు పెళ్లి చేసే స్థోమత లేని పేద తల్లిదండ్రులు తమ కుమార్తెలను అమ్మేసుకుంటున్నారు. ఈ దురాచారాన్ని కూడా కట్నమే కనిపెట్టింది.

**15) పెళ్లయిన తర్వాత:** తక్కువ కట్నం తెచ్చిన నేరానికి ఓ అమ్మాయిని అత్తమామలు ఇంటి నుంచి గెంటేశారు, ఆ అమ్మాయి తన తండ్రి ఇంటికి వెళ్లి పరిస్థితిని వివరించగా, తండ్రి గుండెపోటుతో మరణించాడు.

మీర్ తకీ మీర్ ఉర్దూ భాషలో ప్రసిద్ధి చెందిన కవి, అతని ఆర్థిక పరిస్థితి బాగా లేదు, అతనికి ఒక కుమార్తె ఉంది, ఆమె పెళ్లిలో ఉన్నదంతా అమ్మి అమ్మాయిని అత్తారింటికి ఎంతో ఘనంగా సాగనంపారు. కూతురు గొప్ప పౌరుషవంతురాలు. పెళ్లి రోజు రాత్రి జరిగిన వ్యవహారమంతా తెలిసింది. తన తండ్రి గురించి ఆలోచిస్తూ తీవ్ర మదన పడసాగింది. కుమిలిపోతూ ఎక్కి ఎక్కి ఏడ్చింది...ఒక దశలో ఆమెకు గుండెపోటు వచ్చి మరణించింది. ఆ రాత్రి మీర్ తకీ మీర్ తన కుమార్తె మరణవార్త తెలుసుకున్నప్పుడు, ఇలా అన్నారు:

ఇప్పుడు ఈ నిరాసక్తతలో ఆలోచన తట్టింది

కట్న సామగ్రిలో నీకు కఫన్ ఇవ్వడం మర్చిపోయాము అని.

ఏమండీ పండితులారా... ఏమంటారు ... మీరేమంటారు... స్త్రీ జాతికి జరిగిన ద్రోహానికి మీరేమని బదులిస్తారు....?

అజ్ఞానం, అనాగరికం మూలంగా ఎవరైనా ఇలాంటి దురాచారాలకు, దుష్టకార్యాలకు పాల్పడుతున్నారంటే అది కొంతవరకు సబబైనదే. కాని నమాజులు చేస్తూ, రోజాలు పాటిస్తూ గొప్ప ధార్మికులనబడేవారు సయితం వధువు తల్లిదండ్రుల నుంచి లక్షలు గుంజడం ఎంతో శోచనీయమైన విషయం. పైగా కొందరు కట్నకానుకల్ని ధర్మబద్ధమైన విషయాలుగా చిత్రించడానికి అతితెలివిని ఉపయోగిస్తూ, హజ్రత్ ఫాతిమా (రజి) పెళ్ళిలో ఇవ్వబడిన కొన్ని సాధారణ గృహోపకరణాల ఉదాహరణ ఇస్తారు. కానీ ఈ గృహోపకరణాలను దైవప్రవక్త (సఅసం) ఎలా తెచ్చిచ్చారు. వాటిని ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది మొదలైన వాస్తవాలను వీరు విస్మరిస్తున్నారు.

## ప్రవక్త కుమార్తె పెళ్ళిలో ఇచ్చిన కానుకలు

హజ్రత్ ఫాతిమా (రజి) పెళ్ళి అయ్యేదాకా హజ్రత్ అలీ (రజి) దైవప్రవక్త(స) సంరక్షణలోనే పెరిగారు. ఆయనకు దైవప్రవక్త(స) తప్ప ఇతర ఆప్తులు కూడా లేరు. అందువల్ల దైవప్రవక్త(స) వారిద్దరి కొత్తకాపురం కోసం కావలసిన కనీస గృహోప కరణాలు ఇవ్వడం అనివార్యమయ్యింది. అదైనా హజ్రత్ అలీ (రజి) మహర్ చెల్లించవలసి ఉన్నందున దైవప్రవక్త (స) ఆయన దగ్గరున్న యుద్ధకవచం తీసుకొని అమ్మి వీటిని కొనిచ్చారు.

సీరత్ గ్రంథాల అధ్యయనాన్ని బట్టి దైవప్రవక్త (స) ఆ యుద్ధ కవచం అమ్మగా వచ్చిన డబ్బుతో ఒక పడక, ఒక తలగడ, కొన్ని మట్టి పాత్రలు మాత్రమే ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆయన 'మహర్'ని అడ్వాన్సుగా తీసుకొని వీటిని కొనిచ్చారు. ఇలా అడ్వాన్సు మహర్ పైకం తీసుకొని కొత్త సంసారానికి కావాల్సిన సామగ్రిని కొనిచ్చే సంప్రదాయం ఈనాడు కూడా ఈజిప్ట్ తదితర దేశాల్లో కొనసాగుతోంది.

దైవప్రవక్త (స) ఈ విధంగా గృహోపకరణాలను హజ్రత్ ఫాతిమా (రజి)కు మాత్రమే ఇచ్చారు గాని, తన ఇతర కుమార్తెలెవరికీ ఇచ్చినట్లు చరిత్రలో మనకు ఎక్కడా ఆధారాలు లభించవు. దీన్ని సాకుగా తీసుకొని వేలాది రూపాయల కానుకల్ని గుంజడం ఏ విధంగానూ ధర్మసమ్మతం కాజాలదు. పైగా అది ఇహలోకంలో దేశచట్టం దృష్టిలోనూ, పరలోక పర్యవసానం రీత్యానూ ఘోరమైన పాపం అవుతుంది.

అడిగి లేదా వత్తిడి చేసి తీసుకున్న కట్నం కూడా అధర్మమేనని కొందరు ధర్మవేత్తలు అన్నారు. కనుక ఎవరైనా తెలియక తీసుకుంటే తిరిగి ఇచ్చి వేయడం వాజిబ్ (విధి) అని కూడా వారు పేర్కొన్నారు. ఈ కాలానికి భిన్నంగా పూర్వం ఒకప్పుడు వధువు తల్లిదండ్రులే వరుని తల్లిదండ్రుల నుంచి కొంత పైకం తీసుకొని తమ కూతుర్ని అత్తవారింటికి పంపించేవారు. ఆనాడు ఫిఖావేత్తలు దీన్ని లంచంగా, అధర్మంగా పరిగణించి తిరిగివ్వాలని తీర్పిచ్చారు.

గమనిక: ఇష్టపూర్వకంగా ఇస్తే బహుమతి. బహుమతి ఇవ్వడంలో తప్పేమిటి? అని కొందరు అడగవచ్చు. ఎవరైనా ఇష్టపూర్వకంగా తన కూతురిని ఇస్తే తప్పేమీ లేదు. కానీ షరతు ఏమిటంటే, వారు ఇష్టపూర్వకంగా ఇవ్వాలి, మీ శక్తిని బట్టి ఇవ్వాలి. ఎవరి ఒత్తిడికి గురికాకూడదు. అలా ఇచ్చి వారసత్వాన్ని స్వాహా చేయకూడదు. హాఁ, ఎవరైనా ఒత్తిడి లేకుండా తన కూతురిని బహుమతిగా ఇవ్వాలనుకుంటే, ఇబ్బంది లేదు.

## వరకట్న ఆచారాన్ని రద్దు చేయడం ఎలా?

విందులతో కడుపు నిండదు/ వీల్లను పట్టుకున్న ధన దాహం తీరి చావదు/ వరకట్నపు కోరలతో బుస కొట్టే నాగులివి/ ఆడ బతుకునంటుకున్న జ్వాలలవి / కసికట్టి కాటేసి పెను మంటల తోసేసి / ఇల్లు వల్లకాడు చేసి ఒళ్ళు తగలబెట్టారు.

చదువున్న మనసు లేని యువకులు/ నేడు సంతలోన అమ్మబడే పశువులు/ సర్వస్వం దారపోసి వదువు కొరకు బేరాలు/ కోరినంతకాదంటే వీళ్ళే కొరివి దయ్యాలు..

ఎన్ని వేల పూవులిలా రాలి పోయెనో/ ఎన్ని అందాల చిరు నవ్వులు కాలిపోయనో/ ఏ తరాల కందునమ్మ కన్నవారి కడుపుకోత/ఏ గీతం పాడునమ్మ/ కల్లున్నా చూడలేదు న్యాయము/ కాళ్ళున్నా కదలిరాదు చట్టము/రోజూ కొక్క ఆడపడుచు కాలుతున్న దేశమిది. రంగుల వలలో చిక్కిన నవయువకుల పాపమిది.

1) చట్టం అవసరమే కానీ, చట్టాన్ని సక్రమంగా అమలు చేయకపోవడమే అత్యధిక మరణాల నమోదుకు కారణమని జాతీయ మహిళా సంఘం అభిప్రాయం. సమయానికి స్పందించాల్సిన అవసరం ఉంది. అప్పుడే వరకట్న నిషేధ చట్టం వంటి చట్టాలను అమలు చేయడం సాధ్యమవుతుంది. రక్షక భటులు కూడా కేసు విషయంలో భక్షకులుగా మారి ఉదాసీనంగా వ్యవహరించటంతో ఈ కేసులు నిలబడట్లేదని న్యాయనిపుణుల అభిప్రాయం. ఇలాంటి కేసుల్లో పోలీసులు త్వరితగతిన విచారణ ప్రారంభించి మొదట్లోనే చర్యలకు దిగితే ఫలితం ఉంటుంది.

2) వారసత్వ హక్కు దక్కేలా చూడాలి/ చట్టాల ద్వారా, ఉద్యమాల ద్వారా తరతరాలుగా కొనసాగుతున్న దురాచారాన్ని అరికట్టడం కష్టం. అలాగని ఈ దురాచారాన్ని కొనసాగనివ్వాలని కాదు. సమాజంలో స్త్రీకి పురుషునితో పాటు ఇస్లాం ధర్మం కేటాయించిన ఆస్తిని వారసత్వంగా పొందే వాతావరణం కల్పించాలి.

3) మార్పు యువతలో రావాలి- మార్పు యువతరంతో ప్రారంభం కావాలి. వారి వివాహాలలో కట్నం ఒక కారకంగా ఉండకూడదని వారు వారి తల్లిదండ్రులకు చెప్పేలా చూడాలి. అమ్మాయి తన తల్లిదండ్రులకు చెప్పాలి, ఒక వ్యక్తి ఎంత ధనవంతుడు అనే దాని గురించి కాదు. అతను లోపల ఎవరు ఉన్నారనే దాని గురించి. వరునికి కావలసింది వరకట్నం కాదని/ వరం లాంటి వధువేనని చెబుదాం/ వరకట్న దురాచారాన్ని తరిమికొడదాం/ కలకంఠి కంట కన్నీళ్లు పెట్టించే వరకట్న రక్కసిని కూకటివ్రేళ్ళతో పెకలించుదాం!

4) ఎత్తిపొడవడం కరెక్ట్ కాదు- వరకట్నం వద్దంటే ఈ అబ్బాయికి ఏదో లోపమున్నదని నఖశిఖ పర్యంతం పరీక్ష చేస్తారు. లేకపోతే వచ్చే డబ్బు ఎందుకు వద్దంటాడు అని నిలదీస్తారు. కొందరయితే వరకట్నం తీసుకోకపోయినా- వరకట్నం తీసుకున్నాడనో, గృహ హింస కేసులో లాగి బాగానే దండుకునే ప్రయత్నం చేస్తారు. ఇలా జరగడం సిగ్గుచేటు.

5) రెండు నాల్కల ధోరణి మానుకోవాలి/ పెళ్లిళ్ళలో ఏ కొంచెం తేడా వచ్చినా జీవితాలు నాశనం అవుతాయి. ఏదైనా ఒక అడుగు వేసేటప్పుడు ఆచితూచి వేయాలి. అపాత్రదానము చేస్తే ఆ పాపము మన మెడకు చుట్టుకుంటుంది. అయినా ఈ వరకట్న నిషేధం గురించి కొడుకు పెళ్ళిలో ఎవరూ ఆలోచించరు. కూతురు పెళ్లిలోనేగదా గుర్తు చేసుకునేది. కూతురు పెళ్లిలో వరకట్న నిషేధం గురించి పెద్ద కంఠంతో ఖండించే వారు చాలా మంది కొడుకు పెళ్ళిలో నిశ్శబ్దంగా కట్నం తీసుకునే వారిని నేను చాలా మందిని చూశాను. ఇలాంటి వారిలో మహా పండితులు కూడా ఉన్నారు. ఇక కోట్లకు పడగలెత్తిన కుబేరుల, రాజకీయ నాయకుల వివాహ, వరకట్న తంతు- అది వేరు.

**విన్నపం :** హెచ్చరించినా కొంత మంది వరకట్న లావాదేవీలు ఆపకపోతే పండితులు, సంఘ పెద్దలు వారిని బహిష్కరించాలి. వారి వివాహ వేడుకలకు హాజరుకాకూడదు.

ప్రజలందరూ ధర్మాన్ని రక్షణ కవచంగా ధరించాలి. ప్రతిగా అల్లాహ్ వారికి రక్షణగా ఉంటాడు. ఏది సంఘాన్ని కట్టుబాటులో నిలుపు తుందో అదే ధర్మం. ధర్మ మార్గంలో నడిచిన వారికి సుఖ శాంతులు, శాశ్వతకీర్తి, స్వర్గ లోక ప్రాప్తి కలుగుతాయి. 'ఇస్లాం ధర్మమే సర్వ జగత్తుకూ ఆధారం'. ఇస్లాం ధర్మం కంటే బలమైనది ఈ సృష్టిలో మరేదీ లేదని.. ఇస్లాం ధర్మాన్ని అనుసరించే బలహీనుడు రాజుకన్నా బలవంతుడు, విస్మరించిన వ్యక్తి మహా రాజైనా అల్లాహ్ దృష్టిలో అల్పాతి అల్పుడే. అట్టి ధర్మాన్ని విస్మరిస్తే జరిగేది పతనమే.

మారింది, అర్థం మారింది, వ్యర్థంగా తయారైంది సమాజం, వివాహ బంధానికి కరెన్సీతో విలువ కట్టింది, ఎంత ఎక్కువైతే అంత హెూదా! కన్నవాళ్ళను కష్టాల పాలుజేసే కాలకూట విష సమానమైన ఆలోచన, వరుడని, ఘనుడని దోపిడీ దొంగల్లా దోచుకునే రహదారి, పాతాళానికి పాతుకొని పోయిన విష వృక్షం, అక్షరాస్యులు, నిరక్షరాస్యులూ తేడా లేదు, దీనికెవరూ అతీతంగాదు,

## మారును లోకం తీరును కష్టం!

కొడుకును అమ్ముకునే ఆలోచన పోతుందా? ఈ సమాజం అమ్మాయిని అదృష్టం, శుభవార్త, స్వర్గ సోపానం అని తలుస్తుందా? ఇకనైనా, వరకట్నాలు లేని, ఆదర్శ కుటుంబం వస్తుందా, నిలుస్తుందా, నిలబడుతుందా ఏమో! వేచి చూద్దాం!

మానవ జీవితానికి పరమ ప్రయోజనమైన ఇహపరాల మోక్షం కేవలం ఇస్లాం ధర్మంతోనే సాధ్యం. తొలి ప్రాధాన్యత ధర్మానికే, తొలి స్థానం ధర్మానిదే. అంటే, సంపాదన అయినా, సంసార మయినా, ఆర్థిక విధానాలైనా, రాజకీయ తీరుతెన్నులైనా, జాతీయం అయినా, అంతర్జాతీయం అయినా- ధర్మాన్ని అనుసరించి ఉండాలని దీని అర్థం. అటువంటి ధర్మాన్ని పాటించి.. జీవితాన్ని సార్థకం చేసుకుందాం. ధర్మో రక్షతి రక్షితః!

మారాలి మారి తీరాలి- మనిషి మనసు మహిళకు వరమవ్వాలి- అత్తంటే అమ్మ ప్రేమకు ప్రతిరూపమవ్వాలి- మామంటే నాన్న నవనీత హృదయమవ్వాలి - భర్తంటే భరోసా ఇచ్చే బాధ్యతా హితవరి కావాలి- ఆడబిడ్డంటే అనురాగ బంధమవ్వాలి.

అందమైన అత్తింటి బంధం- ఆడపిల్ల భవితకు- ప్రేమ గంధమవ్వాలి!




## ముస్లిమ్ మహిళ ఇల్లు కొనుగోలు చేసినందుకు హిందువుల నిరసన

భారతదేశంలో విద్వేష వాతావరణం ఎంతగా వేళ్లూనుకుందంటే దానిని అంచనా వేయడం చాలా కష్టం. లోగడ గుజరాత్‌లోని హిందూ మెజారిటీ ప్రాంతంలో ఒక ముస్లిం ఇల్లు కొనుగోలు చేయడంపై కలకలం రేగింది, ఇప్పుడు తిరిగి అలాంటి సంఘటనే ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో చోటు చేసుకుంది. ఉత్తరప్రదేశ్ బరేలీలో హిందూ మెజారిటీ ప్రాంతం అయిన పంజాబ్‌పురా ప్రాంతంలో ఒక ముస్లిం మహిళ ఇంటిని కొనుగోలు చేసింది. దాంతో స్థానిక హిందువులు నిరసన తెలిపారు. ఆ ప్రాంతానికి చెందిన విశాల్ సక్సేనా తన ఇంటిని షబ్నం అనే ముస్లిం మహిళకు విక్రయించడంతో నిరసన మొదలైంది. ఆ మహిళ ఇంటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయమని నిరసనకారులు హెచ్చరించారు. లేకుంటే తాము సామూహికంగా వలస వెళతామని బెదిరించారు. సమీపంలోని దర్గాలో పూలు విక్రయించే షబ్నమ్ సోదరుడు ముహమ్మద్ నసీమ్ బషీరి, నిరసన తెలిపిన స్థానికుల గురించి మీడియాకు తన ఆవేదనను వ్యక్తం చేశాడు. ఈ విషయం ముందుగానే చెప్పి ఉంటే అక్కడ ఇల్లు కొనేవారం కాదని, స్థానికుల కోసం దానిని విడిచిపెట్టే వాళ్ళమని ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో ఇంటి విక్రేత సక్సేనా మాట్లాడుతూ... ఎవరయినా ఆ ఇంటిని కొనడానికి ముందుకొస్తే ప్రస్తుత కొనుగోలు దారు అయిన ముస్లిమ్ మహిళకు ఆమె చెల్లించిన మొత్తం ఇచ్చేసి కొనాలనుకున్న వారికి దానిని అమ్ముతానని అన్నారు.

## అసోంలో ముస్లిమ్ వివాహాలు, విడాకులకు కొత్త బిల్లు

ముస్లింల వివాహం, విడాకులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ అసోంలోని బీజేపీ సర్కార్ ఓ బిల్లును తీసుకురాబోతున్నది. అక్కడ ప్రారంభం కాబోతున్న అసెంబ్లీ సమావేశాల్లో 'అస్సాం కంపల్సరీ రిజిస్ట్రేషన్ ఆఫ్ ముస్లిం మ్యారేజ్ అండ్ డివోర్స్ బిల్-2024'ను ప్రవేశపెడుతున్నట్టు అసోం సీఎం హేమంత బిశ్వ శర్మ తాజాగా ప్రకటించారు. 'ముస్లిం వివాహాలను ఇంతకు ముందు కాజీలు రిజిష్టర్ చేసేవారు. గతంలో మైనర్ల వివాహాల్ని కూడా కాజీలు రిజిష్టర్ చేశారు. కొత్త బిల్లు ప్రకారం అలా కుదరదు' అని చెప్పారు.

## జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా

జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ తన మేనిఫెస్టో విడుదల చేసింది. ఆర్టికల్ 370 పునరుద్ధరణ, జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా, 2000లో అప్పటి అసెంబ్లీ ఆమోదించిన స్వయం ప్రతిపత్తి తీర్మానాన్ని అమలు చేయడం.. వంటి 12 హామీలను మేనిఫెస్టోలో పొందుపర్చింది. పార్టీ కార్యాలయంలో ఇతర నాయకులతో కలిసి పార్టీ ఉపాధ్యక్షులు ఒమర్ అబ్దుల్లా మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ నెరవేర్చగల హామీలను మాత్రమే ఇస్తుందని అన్నారు. జమ్ముకాశ్మీర్‌లో సెప్టెంబరు 18, సెప్టెంబరు 25, అక్టోబర్ 1న మూడు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 4న ఫలితాలు ప్రకటించనున్నారు.

## తమిళనాడు సీఎమ్‌తో సమావేశమైన ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధి బృందం



వక్ఫ్ సవరణ చట్టానికి సంబంధించి ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధికారులు బిజీబిజీగా గడుపుతున్నారు. పార్లమెంటు సంయుక్త కమిటీ సభ్యులతో సమావేశంతోపాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతోనూ సమావేశం అవుతున్నారు. ఈ విషయమై ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు జనరల్ సెక్రటరీ మౌలానా ఫజల్ రహీమ్ ముజద్దిదీ నేతృత్వంలోని పర్సనల్ లా ప్రతినిధి బృందం తమిళనాడు ముఖ్యమంత్రితో సమావేశం అయింది. ఇటీవల ముగిసిన లోక్‌సభ సమావేశంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించినందుకు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రికి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. బిల్లును తదుపరి పరిశీలన కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపడంలో ఆయన కృషి కీలకమైంది. చర్చ సందర్భంగా జెపిసిలోని డిఎంకె సభ్యులు బిల్లును వ్యతిరేకిస్తూనే ఉండాలని ప్రతినిధి బృందం అభ్యర్థించింది.




## ప్రత్యర్థిని ఎదుర్కోవడంలో వెనుకడుగు వేయము

ఆధిపత్య శక్తుల ఒత్తిళ్లను ప్రజాశక్తితోనే ప్రతిఘటించగలమని ఈరాన్ సుప్రీం నేత ఆయతుల్లాహ్ ఖుమేనీ అన్నారు. నేటి ఆధిపత్య శక్తుల డిమాండ్లకు తలొగ్గే ప్రభుత్వాలు..అవి చిన్న వైనా, పెద్ద వైనా సరే ప్రజాశక్తిని సమీకరించి శత్రువుల నిజమైన శక్తి సామర్థ్యాలను కచ్చితంగా అంచనా వేయగలిగినట్లయితే, ఆ ఒత్తిళ్ళను ప్రతిఘటించి విజయం సాధించగలమని ఖుమేని తెలిపారు. ఇజ్రాయిల్‌పై దాడి విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే ఉండదని, రాజీ మాటేవుండదని ఆయన స్పష్టం చేశారు. హమాస్ రాజకీయ విభాగం చీఫ్ హనియె హత్య నేపథ్యంలో ఈరాన్, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలు చెలరేగిన వేళ ఆయన దీనిపై స్పందిస్తూ, ఒకవేళ అలాంటి తిరోగమన వైఖరి తీసుకుంటే 'దేవుడు ఆగ్రహిస్తాడు' అని హెచ్చరించారు. టెహరాన్‌లో అధికార పర్యటనలో ఉన్న సమయంలో హనియె హత్య చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఇజ్రాయిల్‌పై తిరుగుబాటు ప్రణాళికలను పునఃపరిశీలించుకోవాల్సిందిగా ఈరాన్‌పై వస్తున్న ఒత్తిళ్లపై ఖుమేని స్పందిస్తూ.. శత్రువు సాగిస్తున్న మానసిక యుద్ధంగా ఆ ఒత్తిళ్లను అభివర్ణించారు. సైనికపరంగా లేదా రాజకీయంగా లేదా ఆర్థికంగా ఎలాగైనా ఈ విషయంలో వెనుకడుగు వేస్తే 'దైవం క్షమించదు' అని తెలిపారు.

## జపాన్ ప్రధాని రాజీనామా

వచ్చే నెల్లో పదవి నుండి వైదొలగనున్నట్లు జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదా ప్రకటించారు. దశాబ్దాల తరబడి నిరంత రాయంగా దేశాన్ని పాలించిన పాలక లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి) నాయకత్వ ఎన్నికలు వచ్చే నెల్లో జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో విజేత కొత్త ప్రధాని కానున్నారు. పార్టీ చీఫ్‌గా మరోసారి పోటీ చేయాలని తాను కోరుకోవడం లేదని కిషిదా చెప్పారు. పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో ఎల్‌డిపి మారుతోందని ప్రజలకు చూపించాల్సిన అవసరముందని, అందుకోసం తాను పదవి నుండి తప్పుకుంటున్నానని ఆయన విలేకర్లతో చెప్పారు. పారదర్శకంగా ఎన్నికలు జరగాలని, స్వేచ్ఛగా చర్చ జరగడం కూడా ముఖ్యమని చెప్పారు.

## వీసా తిరస్కరిస్తున్న ఆస్ట్రేలియా

ఇజ్రాయెల్-గాజాల మధ్య జరుగుతున్న యుద్ధంలో వేలాది మంది పాలస్తీనియన్‌లు మరణించారు. చాలా మంది శరణార్థులుగా పునరావాసం కోరుతూ పలు దేశాలకు వీసాల కోసం దరఖాస్తు చేసుకొంటున్నారు. ఆస్ట్రేలియా వీసా కోసం కూడా పలువురు పాలస్తీనియన్‌లు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఆ దరఖాస్తులను ఆస్ట్రేలియా తిరస్కరిస్తున్నది. పాలస్తీనియన్‌లు ఆస్ట్రేలియా వీసా కోసం చేసుకున్న దరఖాస్తులు ఎక్కువగా తిరస్కరణకు గురవుతున్నాయని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. అదే సమయంలో ఆస్ట్రేలియా.. ఇజ్రాయెల్ పౌరుల వీసా దరఖాస్తులకు మాత్రం ఆమోదం తెలుపుతుండటం గమనార్హం. ఇప్పటివరకు 10 వేల మంది పాలస్తీనియన్‌లు ఆస్ట్రేలియా వీసాకు దరఖాస్తు చేసుకున్నారని ఆ దేశ హోంమంత్రి టోనీ బుర్కో పేర్కొన్నారు. ఓ మీడియా సంస్థ కథనం ప్రకారం... 10,033 మంది పాలస్తీనియన్‌లు ఆస్ట్రేలియా వీసాకు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 2,922 వీసాలు ఆమోదం పొందగా.. 7,111 తిరస్కరణకు గురయ్యాయి. ఇక ఇజ్రాయెల్ పౌరుల వీసా దరఖాస్తుల్లో 235 దరఖాస్తులను తిరస్కరించగా 8,646 ఆమోదం పొందాయి.

## ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ చాన్సలర్ పదవికి నామినేషన్ వేసిన ఇమ్రాన్ ఖాన్

బ్రిటన్‌లోని ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం చాన్సలర్ పదవికి పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన నామినేషన్ కూడా వేశారు. వర్సిటీకి చాన్సలర్‌గా దాదాపు 21 ఏళ్ల పాటు సేవలందించిన 80 ఏళ్ల లార్డ్ ప్యాటెన్ పదవీ విరమణ ప్రకటించడంతో ఈ పదవి ఖాళీ అయింది. ఇక్కడ చదివిన విద్యార్థులు, ఉద్యోగులు ఈ పదవికి పోటీ చేయడానికి అర్హులు. తాజాగా ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి మార్పులు చేశారు. నామినేషన్, ఓటింగ్ అన్ లైన్‌లో జరిగే వెసులుబాటు కల్పించారు. ఈ ఎన్నికలు అక్టోబర్‌లో జరగనున్నాయి. తదుపరి చాన్సలర్ పదేళ్లపాటు పదవిలో ఉండనున్నారు. కాగా, ఇమ్రాన్ ఖాన్ 1972లో ఆక్స్‌ఫర్డ్‌లోని కెబ్లె కళాశాలలో ఆర్థిక, రాజనీతి శాస్త్రాలను చదివారు. ఆయన 2005-2014 మధ్య కాలంలో బ్రాడ్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్‌గా పని చేశారు. ఈ చాన్సలర్ పదవికి పోటీలో బ్రిటన్ మాజీ ప్రధానులు టోనీ బ్లెయిర్, బోరిస్ జాన్సన్ కూడా ఉన్నారు.

# పాపాల ఊబిలో పడిపోరాదు

- ముహమ్మద్ వహీదుద్దీన్

**సమాజం**లో మంచి వారున్నారు. చెడ్డవారున్నారు. కీర్తి కాంక్ష గలవారున్నారు. పరోపకార పరాయణులున్నారు. నిస్వార్థ సేవాపరులూ ఉన్నారు. నీతి, నిజాయితీ గలవారు  ఉన్నారు. అలాగే ఈ సమాజంలో దుష్టులు, దుర్మార్గులు ఉన్నారు. స్వార్థపరులు, హంతకులూ ఉన్నారు. అల్పులు, బలహీనులు ఉన్నారు. మంచివారు మంచితనమనే సువాసనను పంచి పెడతారు. చెడ్డవారు తమ దుర్గుణాలతో కీడు చేస్తారు.


దైవం మనుషుల కోసం ఈ ప్రపంచాన్ని ఒక పరీక్ష కేంద్రంగా సృష్టించాడు. మనిషి తన తెలివితేటలతో, కృషితో ఈ పరీక్షలో విజయం సాధిస్తాడో లేక తన వ్యసనాల చేత, తన దుర్మార్గాల చేత అపజయం పాలవుతాడో నిర్ణయించుకునేది ఆ వ్యక్తియే. దైవం ఈ పరీక్షలో నెగ్గిన వారికి స్వర్గం, నెగ్గని వారికి నరకం అనేవి కూడా సృష్టించాడు. ఈ రెండింటిలో తాను చేసిన కార్యాలను బట్టి ప్రతిఫలం ప్రాప్తమవుతుంది. నీవు పూల చెట్టు పెంచితే పూల సుగంధాన్ని ఆస్వాదిస్తావు. కంప చెట్టును పెంచావంటే ముళ్ళు గుచ్చుకొని బాధపడతావు అని నీ నిర్ణయానుసారమే ఫలితం ఆధారపడి ఉంటుందని దైవం మనిషికి తాఖీదు చేస్తున్నాడు.

### మనిషి మనస్సు

మనిషి జీవితం అతని మనస్సుపై ఆధారపడుతుంది. మనసు కోర్కెలమయం. కోర్కెలు కళ్లాలు లేని గుర్రం లాగా పరిగెడతాయి. ఆ కోరికలే నరకానికి దారులవుతున్నాయి. ఉదాహరణకు మనసు ఫలానా పని చేయాలని ఇష్టపడుతుంది. ఆ పని నరకానికి తీసుకొని పోయేది కావచ్చు లేక స్వర్గానికి తీసుకుపోయేది కావచ్చు. ఒక వ్యక్తి తన కోరికలను చెడ్డవిగా తలుస్తాడు. అలా తలచిన తర్వాత వాటి వెంట పడకుండా మనసును నిగ్రహించుకుంటున్నాడు. ఉదాహరణకు తెల్లవారగానే నిద్ర లేస్తాను, మసీదు వైపు పోతాను, ఉదయకాలపు ఆరాధన చేస్తాను. పారాయణం చేస్తాను, పాపపు పనులను విడిచిపెడతాను అని అనుకుంటూ వాటిని ఆచరణలో పెడితే స్వర్గానికి చేరుతాడు. అలాగే ఒకని మనస్సు మాత్రం ఇవన్నీ చాలా చెడ్డవిగా తలచి ఉదయం హాయిగా నిద్రపోతే బాగుంటుంది. ఇవన్నీ వట్టి భ్రమలే అని వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుంది. తత్ఫలితంగా నరకానికి చేరువవుతుంది.

### నరకాగ్నిని కాంక్షించేవారు

మనిషి తన కోరికలకు బానిస అయిపోయి మనసు ఇష్ట ప్రకారం చేసుకుంటూ పోతే ఆ మార్గం నేరుగా నరక కూపంలోకి తీసుకు వెళుతుంది. సాధారణంగా మనిషి మనసు వినోదాలకు ఆటపాటలకు ఆలవాలమవుతుంది. పూర్వం వినోదాలకు ఆటపాటలకు ప్రత్యేక స్థలాలు ఉండేవి. వాటి వద్దకు పోయి టికెట్ తీసుకుని చూడాలి. కానీ నేడు వినోదాల కోసం ప్రతి ఇల్లు నిలయమైంది. ప్రతి ఇల్లు టీవీలతో నిండిపోయింది. ప్రతి మనిషి చేతిలో సెల్‌ఫోన్ వచ్చేసింది. మనిషి తన అభిష్టాలు, కోరికలను  తీర్చుకునేందుకు పలు విధాలుగా కష్టపడుతున్నాడు.  డబ్బు సంపాదిస్తున్నాడు. విలాసవంతమైన భవంతులలో ఉంటున్నాడు. నచ్చిన వస్తువులను కొని ఇంటిని అలంకరించుకుంటున్నాడు.  ఈ విధంగా డబ్బులు విచ్చల విడిగా ఖర్చుపెట్టి నరకపు అగ్ని కణాలను కొంటున్నాడు.




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**